


పెన్నమ్మకు గౌతమి పలకరింపు

- పురోగతిలో నదుల అనుసంధానం ప్రక్రియ
- తొలుత గోదావరి నీళ్లు కృష్ణానదికి...

నెల్లూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గోదావరి నది నుంచి ప్రతిఏటా వందలాది టీఎంసీల నీరు సముద్రం పాలవుతుంటే.. గ్రేటర్ రాయలసీమ ప్రాంతం మాత్రం నీటి కొరతతో అల్లాడుతోంది. గోదావరి నుంచి సముద్రం పాలయ్యే నీటిలో సగం నీటిని పెన్నానదికి తరలించినా ఇక్కడి భూముల్లో సిరులు పండుతాయి. లక్షల ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుంది. గోదావరి - పెన్నా నదుల అనుసంధానంతోనే ఇది సాధ్యపడుతుంది. ఇది బృహత్తర ప్రాజెక్టు అయినప్పటికీ ఎంతో ఖర్చుతో కూడుకున్నది. అయితే ఎంత ఖర్చయినా ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించాలని 2014-19 మధ్యలో అప్పటి టీడీపీ ప్రభుత్వం ముందడుగు వేసింది. అప్పట్లో డిజైన్లు కూడా చేశారు. కానీ వైసీపీ అధికారంలోకి రావడంతో ఈ నదుల అనుసంధానం ఊసే కనిపించలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో మళ్లీ ఈ ప్రక్రియలో కదలిక వచ్చింది. ఎలాగైనా ఈ ప్రాజెక్టును మొదలుపెట్టాలన్న లక్ష్యంతో ఉన్న ప్రభుత్వం.. అందుకు సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేస్తోంది. ఇందులో భాగంగా సీఎం చంద్రబాబునాయుడు బుధవారం ఇంజనీరింగ్ నిపుణులతో కీలక సమావేశం నిర్వహించారు. గోదావరి నుంచి పెన్నానదికి నీటిని ఎలా తరలించాలన్న దానిపై చర్చించారు. అందుకు అనువైన పలు మార్గాలపై సమీక్షించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే నెల్లూరు జిల్లా సస్యశ్యామలమవుతుంది. మెట్టప్రాంతాల్లో బీడుగా ఉంటున్న లక్షల ఎకరాలు సాగులోకి వస్తాయి.దీంతో ఈ నదుల అనుసంధానంపై జిల్లా ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




గోదావరి జలాలు తరలింపు మార్గమిలా..

- అనంతరం కృష్ణా నుంచి పెన్నాకి.. • ఈ ప్రాజెక్టుతో జిల్లా సస్యశ్యామలం • మెట్టకూ నీరందే అవకాశం

• జిల్లాకు వరం

రాష్ట్రంలో మరే జిల్లాలో లేని విధంగా నెల్లూరు జిల్లాలో సోమశిల, కండలేరు మేజర్ జలాశయాలు ఉన్నాయి. ఈ రెండింటి సామర్థ్యం 146 టీఎంసీలు. ఈ రెండు ప్రాజెక్టులు కూడా పెన్నా నదిపైనే ఆధారపడ్డాయి. పెన్నాకు వరద వచ్చినప్పుడు మాత్రమే ఇవి నిండుతున్నాయి. అప్పుడు మాత్రమే జిల్లాలో పూర్తి ఆయకట్టు సాగవుతుంది. పెన్నాకు వరదలు రాకపోతే ఇక ఆ ఏడాది బీడు పెట్టుకోవాల్సిందే. గతేడాది కూడా

- మిగతా 6లో



పెళ్లికి వేళాయె...


మండపాలు, మినీ ఫంక్షన్ హాళ్లు, సత్రాలు, ఆలయాల్లో వివాహ వేదికలు మూడు నెలలు ముందుగానే బుక్ అయిపోయాయి. పదేళ్ల క్రితం ఉన్న కల్యాణ వేదికలకు ప్రస్తుతం మూడు రెట్లు పెరిగినా, ఇంకా డిమాండ్‌గానే ఉంది. ఈ ఏడాది పెళ్లిళ్ల సీజన్‌కి గతం కంటే దాదాపు 30 నుంచి 50 శాతం మేర అన్నీ రేట్లు పెంచేశారు. ఈ రెండు నెలల్లో జరిగే పెళ్లిళ్లకు దాదాపు ఆరుకోట్ల రూపాయల వ్యాపారం జరగవచ్చని మ్యారేజ్ ఈవెంట్ల నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.

ఈనెల, వచ్చే నెలలో సుమారు 20 రోజులకుపైగా శుభముహూర్తాలు ఉన్నాయి. ఈ ముహూర్తాలలో సుమారు 90వేల జంటలు ఒకటి కానున్నాయి. దీంతో జిల్లాలోని కల్యాణ

6

నేడు కార్తీక పౌర్ణమి

- ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి
- లక్ష దీపోత్సవానికి సర్వం సిద్ధం



కార్తీక లక్ష దీపోత్సవానికి ముస్తాబైన నెల్లూరులోని గణేష్ ఘాట్

నెల్లూరు (సాంస్కృతికం) నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసంలో వచ్చే పౌర్ణమి విశిష్టమైంది. ఆ రోజున శివకేశవు లను పూజిస్తే సర్వ పాపాలు తొలగి, సిరి సంపదలు కలుగుతాయని పురాణ కథనం. శుక్రవారం ఉదయం 6.19 గంటల నుంచి శనివారం తెల్లవారు జామున 2.58వరకు పౌర్ణమి ఘడియలు ఉంటాయి. ఉదయం 6.44 నుంచి 10.48 గంటల మధ్య మంచి ముహూర్తం ఉంది. కేదారేశ్వర వ్రతం, చలిమిడివ్రతం, కార్తీక దీప వ్రతాలను ఆచ రించవచ్చని పండితులు పేర్కొన్నారు. సాయంత్రం దీపదానాలు, చంద్రదర్శనం, కార్తీక వనభోజనాలు చేయవచ్చని వివరించారు.

• ఆలయాల్లో ఏర్పాట్లు

జిల్లాలోని అన్నీ శివ, వైష్ణవ ఆలయాల్లో కార్తీక పౌర్ణమికి భారీ ఏర్పాటు చేశారు. నగరంలో ఆలయాలతోపాటు స్వర్ణాల చెరువు గణేష్ ఘాట్ వద్ద కార్తీక లక్ష దీపోత్సవానికి సర్వం సిద్ధం చేశారు.. భక్తులకు ఎండ,వాన తగలకుండా ప్రత్యేక షామియానాలు వేశారు సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశారు. సింహపురి కార్తీక దీపోత్సవ కమిటీ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరగనున్నది. ఉదయం 6 గంటలకు గోపూజ, రుద్రహోమం, రుద్రాభిషేకాలు జరుగుతాయి. సాయంత్రం 5గంటలకు సింహపురి మహిళల కార్తీక దీప శోభాయాత్ర, మహారుద్ర హోమం, గంగా హారతులు, లక్ష దీపోత్సవం, అనంతరం 108 తెప్పలతో శివలింగాకారం నిర్వహించనున్నారు. జిల్లా దేవదాయశాఖ ఆధ్వర్యంలో గణేష్ ఘాట్ వద్ద ఉదయం నుంచి రాత్రి వరకు నిరంతరం ప్రసాదవినియోగం ఉంటుంది.

జిల్లా వ్యాప్తంగా సీపీఎం ప్రదర్శనలు

- కలెక్టరేట్ వద్ద ధర్నా • ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- జిల్లా కార్యదర్శి మూలం రమేష్



నెల్లూరు నగరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఎం నేతలు

నెల్లూరు (వైద్యం) నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా గురువారం సీపీఎం నాయకులు, కార్యకర్తలు గురువారం ప్రదర్శనలు నిర్వహించారు. ఇందులో భాగంగా నెల్లూరు నరగంలో సీపీఎం నేతలు భారీ ప్రదర్శన నిర్వహించారు. గాంధీబొమ్మ నుంచి కలెక్టరేట్ వరకు సాగిన ప్రదర్శన అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సంద ర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లా డుతూ దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ రంగ సంస్థల ను, వనరులను, సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడు తున్న దని దుయ్యబట్టారు. జమిలి ఎన్నికల వల్ల నియంతృ త్వానికి దారితీసే అవకాశం ఉందన్నారు. వక్ఫ్‌బోర్డు చట్టసవ రణలు, జమిలి ఎన్నికల ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం విరమిం చుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని, విద్యుత్ ట్రూ అప్ చార్జీల పేరుతో రూ. 17వేల కోట్లు ప్రజలపై భారం మోపడం సరికాదన్నారు. సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లా డుతూ కృష్ణా పట్నం కంటైనర్ టెర్మినల్‌ను వెంటనే పునరుద్ధరిం చాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు మాదాల వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, నాగేశ్వర రావు , షేక్ మస్తాన్‌బీ, సూర్యనారాయణ, కాయం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

- ఆర్టీసీలో స్టాళ్లు, హోటళ్ల నుంచి అధికారులకు నెల మామూళ్లు
- డ్రైవర్లకు, సమావేశాలు, స్పోర్ట్స్‌మీట్‌లకు కూడా ఉచితంగా భోజనం
- ప్రయాణికులపై అధిక ధరల భారం

ముద్ద పెట్టి.. ముడుపులివ్వాల్సిందే !

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ఆర్టీసీ రీజియన్ పరిధిలోని బస్టాండ్లలో అధికారుల వసూళ్ల దందా జోరుగా కొనసాగుతోంది. వివిధ స్టాళ్ల యాజమానులు అధికారులకు నెల మాముళ్లు ఇస్తూ ఎమ్మార్పీ కంటే అధికంగా వసూలు చేస్తు న్నారు. దీంతో ప్రయాణికులపై అధిక ధరల భారం పడుతున్నది. మొత్తం మీద ఆర్టీసీలో అధికారులు, స్టాళ్ల యాజమానులు అంతా కూడా నాలుగు రూపాయలు వెనుక వేసుకుంటూ సంతోషంగా ఉన్నారుకానీ, ప్రయాణికులు మాత్రం దోపిడీకి గురవుతున్నారు.

• ఎంతకైనా అమ్ముకోండి...

ఆర్టీసీ నెల్లూరు రీజియన్ పరిధిలో 315 స్టాళ్లు ఉండగా, వాటిలో 28 స్టాళ్లు ఖాళీగా ఉన్నాయి. ఐదు హోటళ్లు ఉన్నాయి. బస్టాండుల్లో స్టాళ్లు పొందే వ్యాపారులు టెండర్లు ద్వారా డిపాజిట్ చెల్లించి వాటిని పొందుతారు. అయితే ఆర్టీసీ బస్టాండ్‌లో స్టాల్స్‌కు బాడుగ ఎక్కువగా ఉంటుంది. నెల బాడుగ చెల్లించేందుకు వ్యాపారులు నానా అవస్థలు పడుతుంటారు. ఈ క్రమంలోనే ఆర్టీసీ అధికారులు 'ఎమ్మార్పీ కంటే అధికంగా అమ్ముకోండి.. స్టాళ్లకు కేటాయించిన పరిధికంటే ఎక్కువగా బస్టాండు ప్రాంగణంలోకి పెట్టుకోండి...నిషేధిత వస్తువులను ఏవైనా విక్రయించుకోండి.. అయితే మా మాముళ్లు మాకు ఇచ్చేయండి' అంటూ ఆఫర్లు ఇస్తున్నారు. దీంతో చేసేది లేక స్టాళ్ల యాజమానులు నెల నెలా అధికారులకు మామూళ్లు ఇస్తూ అధిక ధరకు వస్తువులను ప్రయాణికులకు అమ్ముతున్నారు. డీఎం నుంచి ఆర్ఎం స్థాయి వరకు, విజిలెన్స్ కానిస్టేబుల్ నుంచి ఉన్నతాధికారుల వరకు మామూళ్లు ఇస్తున్నట్లు సమాచారం.

• హోటళ్లలోనూ దందా

ఆర్టీసీ బస్టాండ్లల్లోని హోటళ్లలో సహజంగానే ధరలు అధికంగా ఉంటాయి. అంతేకాక తినుబండారాలు, భోజనంలో నాణ్యతా లోపం, నిల్వ పదార్థాలు.. ఇలా అనేక లోటుపాట్లు ఉంటాయి. అయితే ఆర్టీసీ అధికారులు డిపోల వారీగా హోటల్‌కు రూ.10 వేలు చొప్పున నెల మామూళ్లు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో పాటు డ్రైవర్లకు 20 శాతం రాయతీతో భోజనం పెట్టాల్సి ఉండగా ఫ్రీ భోజనం పెట్టాలన్న

- మిగతా 6లో



నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్‌లోని హోటల్

యువశక్తే ఆయుధం

కావలిటౌన్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): దేశానికి యువ శక్తే గొప్ప ఆయుధమని కేంద్ర రక్షణశాఖమంత్రి సాంకేతిక సలహాదారు జీ సతీష్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం కావలిలోని జేబీ డిగ్రీ కళాశాల ఎంఎం హాల్ లో సతీష్‌రెడ్డికి విశ్వోదయ జీవితకాల సభ్యత్వాన్ని ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి చేతుల మీదుగా అందచేశారు. అనంతరం విశోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఆయన్ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో 4.35 కోట్లమంది యువత ఉన్నారని, దేశం బలంగా, సుసంపన్నంగా ఉండాలంటే విద్య, విజ్ఞానంతోనే సాధ్యమన్నారు. విద్యను ప్రసాదించాలన్న ఆశయం కలవారం తా గొప్పవారని అన్నారు. విశ్వోదయ విద్యాసంస్థల వ్యవస్థాపకులు దొడ్ల రామచంద్రా రెడ్డి ఆకోవకు చెందిన వారేనని పేర్కొన్నారు. అంకితభావంతో పని చేస్తే లక్ష్యాలు చేరుకోవడం సులువవుతుందన్నారు. తాను దేశానికి ఏదైనా చేయాలనే సంకల్పంతో ప్రతిఒక్కరూ ఉండాలని, ఆదిశగా కృషి చేయాలని పూర్వరాష్ట్రపతి అబ్దుల్ కలామ్ అంటుండేవారని ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేత కర్నాటి ఆంజనేయరెడ్డి, జేబీ కరస్పాండెంట్ సుధాకర్ రెడ్డి, పలువురు అధ్యాపకులు విద్యార్థులు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

సతీష్‌రెడ్డికి 'విశ్వోదయ' జీవితకాల సభ్యత్వం



డాక్టర్ సతీష్‌రెడ్డికి విశ్వోదయ జీవితకాల సభ్యత్వం అందచేస్తున్న కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, రెక్టార్ వినయ్‌కుమార్‌రెడ్డి తదితరులు



నెల్లూరులో కురుస్తున్న వర్షం

వదలని వాన

- మూడు రోజులుగా తెరపివ్వని వర్షం • జనజీవనం అస్తవ్యస్తం

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మూడు రోజుల నుంచి జిల్లాలో వర్షం కురుస్తూనే ఉంది. గురువారం ఉదయం కొంతసేపు ఎండకాసినా మళ్లీ భారీగా వర్షం పడింది. దీంతో రోడ్లపై నీరు చేరింది. రాకపోకలకు అంతరాయం కలిగింది. జనజీవనం అస్తవ్యస్తమైంది. నెల్లూరు నగరంలో వర్షానికి రైల్వే అండర్ బ్రిడ్జిలు నిండుకున్నాయి. అధికారులు అప్రమత్తమై నీటిని తోడేశారు. ఇళ్ల ముందు మురుగు కాలువల్లో చెత్త పేరుకుని ఉండ టంతో వర్షపు నీరు ముందుకుకదలటం లేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా కూడా వర్షం కురిసింది. వాగులు, వంకలు ప్రవహించాయి. పలు చెరువుల్లో నీరు చేరింది.



నెల్లూరు : అరవింద్ నగర్‌లో రైల్వేట్రాక్ కింద చేరిన వర్షపు నీరు

• సగటు వర్షపాతం 25.7 మిమీ :

జిల్లాలో గురువారం సగటు వర్షపాతం 25.7 మి.మీగా నమోదైంది. జిల్లాలో అత్యధికంగా దగదర్తిలో 75.4 మి.మీ, అత్యల్పంగా రాపూరులో 2.2 మిమీ వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా వర్షపాతం వివరాలు.. బోగోలు 35.4, ఏఎస్‌పేట 24, విడవలూరు 6, ముత్తుకూరు 14.2, కొడవలూరు 4, సీతారాంపురం 22.8, దుత్తలూరు 22.8, టీపీగూడూరు 27.4, బుచ్చి 15, ఉదయగిరి 28.4, వింజమూరు 20.2, సంగం 58.6, నెల్లూరు అర్బన్ 7.8, నెల్లూరు రూరల్ 6.4, వెంకటాచలం 14.8, మర్రిపాడు 16.2, ఇందుకూరుపేట 7.2 మనుబోలు 9.2, కావలి 65.4, జలదంకి 44.2, అల్లూరు 41, సైదాపురం 16.6, పొదలకూరు 4.6, కందుకూరు 48.4, కలిగిరి 21.8, ఆత్మకూరు 51.2, కోవూరు 27.2, వలేటివారి పాళెం 21.8, ఉలవపాడు 44, లింగసముద్రం 12.4, గుడ్లూరు 32.2, వరికుంటపాడు 4.2, కొండాపురం 17, చేజర్ల 20.4, అనంతసాగరం 41, కలువాయి 47.2 మి.మీ వర్షపాతం నమోదైంది.



చిట్టగుంట : తాళ్లూరులో పొంగి పొర్లుతున్న వాగు



ఉదయగిరి మండలం గంగిరెడ్డిపల్లిలో నేలకొరిగిన వరిపైరు

ఈ మార్గంలో మనుషులు నడిచేదెలా..?



పట్టణంలో ప్రధాన కూడలికి అనుసంధానంగా ఉన్న మల్లితోట అంతర్గత రహదారి అధ్వానంగా ఉంది. చిన్న వర్షం పడినా బురదమయంగా మారుతుంది. ఈ మార్గం వ్యాపార సముదాయప్రాంతం కావడంతో నిత్యం వందలాది మంది ఈ రహదారిలో నడవాల్సి వస్తుంది. ఈ మార్గంలో నడవడం ఎలా..? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

- కలిగిరి, (ఆంధ్రజ్యోతి)

చినుకు రాలితే చిత్తడే !



పట్టణంలోని పేదలు నివసించే కాలనీల్లో చినుకు రాలితే చిత్తడిగా మారుతుంది. స్థానిక బాలక్రిష్ణారెడ్డి నగర్, ముసునూరు ఇందిరమ్మ కాలనీ, చంద్రబాబు నాయుడు కాలనీ, అట్టలఫ్యాక్టరీ కాలనీ, వినాయక కాలనీలు మంగళ, బుధవారాల్లో కురిసిన వర్షానికి జలమయమయ్యాయి. అంతర్గత రోడ్లు, మురుగునీటి కాలువలు లేకపోవటం తో వర్షపు నీరు, మురుగునీరు మొత్తం రోడ్డుపై నిల్వ చేరి బురదమయంగా మారాయి.

- కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి)

పవిత్రోత్సవాలు పరిసమాప్తం



వేదగిరి క్షేత్రంలో జరుగు తున్న పవిత్రోత్సవాలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు విశేష పూజలు, హోమాల అనంతరం మహా పూర్ణాహుతి నిర్వహించారు. లక్ష్మీ నృసింహస్వామి, ఆదిలక్ష్మి అమ్మవార్లకు జరిగే నిత్య కైంకర్యాలు, ఉత్సవాల్లో దోషాల నివృత్తికి ఏటా ఈ పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నారు. వైఖానస ఆగమ విద్వాన్ డాక్టర్ పీ సత్యనారాయణ చార్యులు, ఆలయ ప్రధాన అర్చకుడు భాస్కరాచార్యులు నేతృత్వంలో ఉత్సవాలు జరిగాయి. ఈవో గోపి పర్యవేక్షించారు. కార్యక్ర మంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, నాయకులు మదన్ కుమార్‌రెడ్డి, చక్రవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

- నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి)



పొదలకూరులోని సంగం రోడ్డు కూడలిలో వనభోజనాల్లో భాగంగా శమీవృక్షానికి పూజలు

వనంలో జనం

- కార్తీకమాసంలో వనభోజనాలు
- సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి
- నిర్వహణకు కులసంఘాలు, ఉద్యోగుల ఆసక్తి

సంప్రదాయం

పొదలకూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ఎంతో విశిష్టమైనదని పురాణాలు చెబుతున్నాయి. ఈ నెలలో ప్రజలు భక్తిశ్రద్ధలతో శివకేశవులను ఆరాధిస్తారు. ఈ మాసంలోనే వనభోజనాలకు ఎనలేని ప్రాధాన్యం ఉంటుంది.. వివిధ కులసంఘాలు, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతుంటాయి. ఎన్నోఏళ్లుగా ఈ సంప్రదాయం కొనసాగుతోంది. వనభోజనాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు సైతం నిర్వహిస్తుంటారు. కొన్నేళ్ల క్రితం కార్తీక వనభోజనాలను కుటుంబ సమేతంగా నిర్వహించుకునేవారు. కాలక్రమేణా సామాజిక వర్గాలు, ప్రభుత్వశాఖలు, స్వచ్ఛంద సంస్థలు, కులసంఘాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి. కార్తీక వన భోజనాలు మొదట్లో ఎక్కువగా గ్రామ శివారు ప్రాంతాలు, మామిడి తోపులు, ఇతర ఉద్యానవనాల్లో కొనసాగేవి. ఆ తర్వాత నగరవనం, వివిధ ఫంక్షన్ హాళ్లు, ఆలయాల నిర్వహిస్తున్నారు. వనభోజనాలు ఎక్కువగా ఆదివారం, ఇతర సెలవురోజుల్లో నిర్వహిస్తారు.

● ఆహ్లాదకర వాతావరణంలో..

కార్తీకమాసంలో ప్రతిరోజూ పవిత్రమైనదే. ఈ నెలంతా వన భోజనాలు నిర్వహిస్తుంటారు. పిల్లల కేరింతలు, యువత కోలాహలం, మహిళల ఆట పాటలతో ఆయా ప్రాంతాలు సందడిగా ఉంటాయి. వినోదం పంచేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు సైతం ఏర్పాటు చేస్తారు. కార్తీక వనభోజన కార్యక్రమం పండుగ వాతావరణాన్ని తలపిస్తూ ఉంటుంది.

● సరికొత్త పరిచయాలు

ఈ కార్యక్రమానికి కుటుంబ సమేతంగా వస్తుంటారు. ఈ నేపథ్యంలో కొత్త పరిచయాలు ఏర్పడుతాయి. అప్పటి వరకు ముఖ పరిచయం లేకపోయినా వనభోజనంలో అందరూ ఒక్కటవుతారు. కొన్ని ప్రాంతాల్లో వధూవరుల పరిచయ వేదికలను సైతం నిర్వహిస్తుంటారు. పదో తరగతి, ఇంటర్, ఆపై చదువుల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను సత్కరించి, వారికి నగదు బహుమతులను అందచేస్తుంటారు. అంతేకాక ఆయా సామాజికవర్గాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి చేదోడుగా నిలుస్తున్నారు. ఆరోగ్యపరంగా ఇబ్బందులు గుర్తించి ఆదుకుంటున్నారు.



వనభోజనాలు చేస్తున్న పట్టణవాసులు

రామయ్య తలంబ్రాల తయారీలో పాల్గొనండి!

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలంలోని సీతారామచంద్రస్వామికి శ్రీరామనవమి సందర్భంగా జరిగే కల్యాణోత్సవం కోసం తలంబ్రాలు తయారు చేసే కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొనాలని మూలాపేటకు చెందిన శ్రీరామభక్తుడు ఎస్‌వీ విజయకుమార్ ఓ ప్రకటనలో కోరారు. రామచంద్రుని కల్యాణ తలంబ్రాల కోసం గోదావరి జిల్లాలో ప్రత్యేకంగా వరి పండిస్తారని తెలిపారు. ఆ ధాన్యాన్ని భక్తులు శ్రీరామ నామస్మరణతో గోటితో వలిచి బియ్యం తయారు చేస్తారని తెలిపారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా భక్తులు గోటితో వలిచి తయారు చేసిన బియ్యాన్ని కల్యాణ తలంబ్రాలుగా వాడుతారన్నారు. జిల్లాలో ఆసక్తి ఉన్నవారు 93904 26999 నెంబరును సంప్రదించాలని కోరారు.



ఇద్దరు ఒకటయ్యే వేళ..

- కల్యాణం.. కమనీయం
- ఈనెల, వచ్చేనెలలో దండిగా ముహూర్తాలు
- జిల్లాలో దాదాపు 90వేల వివాహాలు
- సుమారు రూ.ఆరుకోట్ల వ్యాపారం

మూడుముళ్ల పంట

నెల్లూరు (సాంస్కృతికం) నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది చివరినెలలయిన నవంబరు, డిసెంబరు మాసాల్లో సుమారుగా 20 రోజులకుపైగా శుభముహూర్తాలు ఉన్నాయి. ఈ ముహూర్తాలలో సుమా రు 90వేల జంటలు ఒకటి కానున్నాయి. దీంతో జిల్లా అంతా శ్రీరస్తు.. శుభమస్తు .. కల్యాణమస్తు అంటూ బ్యాండ్‌మేళాల మోతలు మోగను న్నాయి. నవంబరులో 16, 17, 18, 22, 23, 25, 26, 28, 29 వివాహ మూహూర్తాలు ఉన్నాయి. 17, 18తేదీల్లో అత్యధిక అత్యధిక వివాహాలు జరగనున్నట్లు పురోహితులు తెలిపారు. డిసెంబరులో 2, 3, 4, 5, 9, 10, 11, 13, 14, 15తేదీల్లో వివాహ మహూర్తాలు ఉన్నాయి. ఆ నెలలో 6, 7, 8, 11, 13తేదీల్లో బలమైన ముహూర్తాలు ఉన్నాయి. ఈ ఐదురోజుల్లో మామూలు డిమాండ్ కంటే రెండు రెట్లకుపైగా పెళ్లిళ్ల జరగబోతున్నాయి.

ముందుగానే బుకింగ్

జిల్లాలో కల్యాణ మండపాలు, మినీ ఫంక్షన్ హాళ్లు, సత్రాలు, ఆలయాలు అన్ని కలిపి దాదాపు మూడు వేలకుపైగా వివాహ వేదికలు ఉన్నాయి. ఈ వేదికలన్నీ మూడు నెలలు ముందుగానే బుక్ అయిపోయాయి. 2025లో జరుగబోయే వివాహాలకు మార్చి వరకు వివాహ వేదికలు అక్టోబరులోనే బుక్ అయిపోయాయి. దీంతో జిల్లావ్యాప్తంగా కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. పదేళ్ల క్రితం ఉన్న కల్యాణ వేదికలకు ప్రస్తుతం మూడు రెట్లు పెరిగినా, డిమాండ్ ఇంకా ఉంది. వివాహం అంటే కూలీల దగ్గర నుంచి పురోహి తులు వరకు దాదాపు 36 వ్యవస్థలతో ముడిపడి ఉంది. అన్ని అందు బాటులో ఉండి జరిగే వివాహాలు కనువిందు చేస్తాయి. ఒకేసారి ము హూర్తాలు రావడంతో డిమాండ్ పెరిగింది. ఈ ఏడాది కల్యాణ మండ పాలు, పురోహితులు, మేళగాళ్లు, డేకరేషన్, ఫొటో షూటర్లు, హోటళ్లు, క్యాటరింగ్‌లు ఈ సంవత్సరం పెళ్లిళ్ల సీజన్‌కి గతం కంటే దాదాపు 30 నుంచి 50 శాతం మేర రేట్లు పెంచేశారు.

పెరిగిన ఖర్చు

సామాన్య కుటుంబంలో ఓ వివాహం జరగాలంటే, కనీసం రూ. 3నుంచి రూ. 4.50లక్షలు దాటుతోంది. కోటీశ్వర్ల వివాహాలకు రూ. కోటి నుంచి రూ.2కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారని మండప నిర్వాహ కులు తెలియజేస్తున్నారు. వివాహ ఖర్చులు కులమతాలకు తేడా లేకుండా అన్నీ వర్గాల్లోనూ పెరిగిపోతుంది. వివాహాలకు ఈ రెండు నెలల్లో సుమారు ఆరుకోట్ల రూపాయల వ్యాపారం జరగవచ్చని మ్యా రేజ్ ఈవెంట్ల నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.

తప్పని నిరీక్షణ

- ప్రారంభం కాని రేషన్, పింఛన్ దరఖాస్తుల ప్రక్రియ
- గత వైసీపీ పాలనలో నిలుపుదల
- 8 నెలలుగా అర్హుల పడిగాపులు
- కూటమి ప్రభుత్వంలోనూ సాగదీత

సంగం, (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డులు, పింఛన్ల మంజూరు కోసం అర్హులకు ఎదురుచూపులు తప్పడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు పూర్తయినా ఇప్పటి వరకూ వాటి ఊసే లేదు. దీంతో అర్హులైన పేదలు వాటి కోసం ఎదురుచూస్తున్నారు. వైసీపీ హయాంలో ఆకారణంగా రేషన్ కార్డులు, పింఛన్లు కోల్పోయిన వారు, ఇటీవల వివాహమై అర్హత కలిగిన కొత్త దంపతులు తిరిగి పొందడం కోసం కూటమి ప్రభుత్వం వైపు ఆశగా చూస్తున్నారు.

● కార్డు కోసం..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పింఛన్ ఒక్కసారిగా రూ. 3 వేల నుంచి 4 వేలకు పెంచింది. దీపం -2 పథకం అమలు చేస్తున్నారు. దీంతోపాటు సూపర్ సిక్స్ పథకాలు ఒక్కొక్కటిగా అందుబాటులోకి వస్తున్నాయి. వీటిలో ఏ పథకం పొందాలన్నా రేషన్‌కార్డును ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకుంది. దీంతో అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ పింఛన్లు, రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు. వీరిలో ఎక్కువమంది గత వైసీపీ ప్రభుత్వం తొలగించిన పింఛనుదారులు, కార్డుదారులే ఉన్నారు. వారికి తోడు వైసీపీ హయాంలో దరఖాస్తు చేసుకున్నా కార్డులు రాని వారు, తాజాగా అర్హత పొందినవారు చాలా మందే ఉన్నారు. వారంతా ఇప్పుడు పింఛన్లు, రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే గత మార్చిలో వచ్చిన ఎన్నికల కోడ్ కారణంగా దరఖాస్తుల ప్రక్రియ ఆగిపోయింది. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు పూర్తయినా దరఖాస్తుల ప్రక్రియకు శ్రీకారం చుట్టలేదు. ప్రభుత్వం స్పందించి వెంటనే రేషన్ కార్డులు, పింఛన్ మంజూరుకు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియను ప్రారంభించాలని కోరుతున్నారు.

పింఛన్ కోసం ఎదురుచూస్తున్నాం



నా భర్త జనవరిలో చనిపోయాడు. మాది పేద కుటుంబం. ముగ్గురు పిల్లలు. పోషణ జరగడం కష్టంగా ఉంది. మగ్గం నేసి జీవనం సాగిస్తున్నాం. వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేదామంటే సచివాలయానికి ఎప్పుడు వెళ్లినా వెబ్‌సైట్ వదల లేదని చెప్పుతున్నారు. పది నెలలుగా ఎదురుచూస్తున్నాం.

- జే నిర్మల, సంగం

రేషన్ కార్డు రద్దు



గత వైసీపీ ప్రభుత్వంలో కరంటు బిల్లు ఎక్కువ వచ్చిందని రేషన్ కార్డు రద్దు చేశారు. నా మీటరుకు వేరే వారి ఆధార్ నెంబరు లింక్ కావడంతో బిల్లు ఎక్కువగా వచ్చింది. దీంతో రేషన్‌కార్డు రద్దు చేశారు. సరిచేసినా రేషన్‌కార్డు పునరుద్ధరించలేదు.

- పి. ప్రసాద్, సంగం



మాట్లాడుతున్న పంచాయతీ విస్తరణాధికారి రమేష్‌బాబు

తూ తూ మంత్రంగా శిక్షణ తరగతులు

వలేటివారిపాలెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన మండలస్థాయి శిక్షణతరగతులు తూతూమంత్రంగా జరిగాయి. ఉదయం 9గంటలకు ప్రారంభం కావల్సిన కార్యక్రమానికి సభ్యులు, అధికారులు ఆలస్యంగా రావడంతో 11-30 గంటలకు ప్రారంభమైంది. సాయంత్రం 6గంటల వరకూ జరగాల్సిన శిక్షణా తరగులు మధ్యాహ్నం రెండు గంటలకే ముగించారు. మండలంలో 21మంది సర్పంచ్‌ల్లో నలుగురు, 10మంది ఎంపీటీసీల్లో ఒక్కరు మాత్రమే వచ్చారు. జడ్పీటీసీ కూడా శిక్షణా తరగతులకు హాజరు కాలేదు. వివిధ శాఖల్లోని 20మందిలో ఒక్క మండలస్థాయి, 31మంది వీఓఏల్లో కూడా హాజరుకాలేదు. కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు మాత్రమే వచ్చారు. మొక్కుబడిగా శిక్షణా తరగతులు నిర్వహిస్తే పంచాయతీలు ఎలా అభివృద్ధి చెందుతాయని ప్రజలు ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో వెంగమాంబ పల్లకీ సేవ

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ గ్రామంలో ఉన్న వెంగమాంబ పేరంటాలమ్మ పల్లకీ సేవను గురువారం ఆలయ వ్యవస్థాపక ధర్మక ర్తలు, కార్యనిర్వాహణాధికారి ఆధ్వర్యంలో అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక చందన అలంకారం, కుంకు మార్చన కార్యక్రమాలు నిర్వహించి అనంతరం పలకీసేవ చేపట్టారు.

నేడు కార్తీక పౌర్ణమి మహోత్సవం

వెంగమాంబ పేరంటాలమ్మ ఆలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వా హణాధికారి వెట్టిగుంట ఉషశ్రీ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అమ్మవారికి పంచామృతాభిషేకం, కల్యాణోత్సవం, పూజా కార్యక్ర మాలతోపాటు భక్తులకు వనభోజనం, సాయంత్రం లక్ష దీపాలతో దీపోత్సవ కార్యక్రమాలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. అలాగే దుత్తలూరు కొండమీద ఉన్న శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయం, ఉదయగిరి మండలం గండిపాళెం జలాశయం వద్ద ఉన్న శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

పెన్నమ్మకు గౌతమి పలకరింపు

(5వ పేజీ తరువాయి)

ఇదే జరిగింది. ప్రాజెక్టుల్లో నీరు లేకపోవడంతో సగం ఆయకట్టులో కూడా సాగు జరగలేదు. అయితే గోదావరి-పెన్నా నదుల అనుసంధానంతో బీడు అనే మాట శాశ్వతంగా తొలగిపోతుంది. ప్రస్తుతం సోమశిల, కండలేరు జలాశయాల పరిధిలో 7.76 లక్షల ఎకరాల రిజిస్టర్ ఆయకట్టు ఉంది. గోదావరి నీటిని ఏటా తీసుకురాగలిగితే ఈ ఆయకట్టును మరింత పెంచుకు నేందుకు అవకాశం కలుగుతుంది. అప్పుడు ఆత్మకూరు, ఉదయగిరి ప్రాంతాల్లోని భూములను కూడా ఆయకట్టు పరిధిలోకి తెచ్చుకోవచ్చు.

● ఇదీ మార్గం..!

కృష్ణానదికి భారీ వరదలు వచ్చినప్పుడు మాత్రమే శ్రీశైలం నుంచి జలాలను సోమశిలకు మళ్లించగలు గుతున్నారు. శ్రీశైలం జలాశయం వద్ద పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి కృష్ణా జలాలను మళ్లించి బనకచర్ల వరకు తీసుకువస్తున్నారు. అక్కడి నుంచి వెలుగోడు, కేసీ కెనాల్‌తో పాటు నిప్పుల వాగుకు మళ్లిస్తున్నారు. నిప్పులవాగు నుంచి కుందూ నదిలోకి కృష్ణాలు చేరుతుండగా, కుందూ నది నేరుగా పెన్నాలో కలుస్తోంది. పెన్నాలోకి వచ్చాక నేరుగా సోమశిలకు చేరుతున్నాయి. మొత్తంగా పోతిరెడ్డిపాడు నుంచి సుమారు 200 కిలోమీటర్లు పయనించి కృష్ణా జలాలు సోమశిలకు చేరుతున్నాయి. ఇప్పుడు గోదావరి నీటిని కూడా ఇదే మార్గంలో పెన్నాలోకి తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోంది. తొలుత పోలవరం కుడి ప్రధాన కాలువ నుంచి ప్రకాశం బ్యారేజీకి నీటిని తీసుకువస్తారు. ప్రకాశం బ్యారేజీకు పైనున్న వైకుంఠపురం నుంచి కాలువ ద్వారా గుంటూరు జిల్లాలోని బొల్లాపల్లి రిజర్వాయర్‌కు తరలిస్తారు. అక్కడి నుంచి నల్లమల అడవుల మీదుగా కాలువ మార్గంలో కర్నూలు జిల్లాలోని బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ వరకు తీసుకొస్తారు. ఇక్కడి నుంచి కర్నూలు, కడప, నెల్లూరు జిల్లాలకు గోదావరి నీటిని ఇప్పటికే ఉన్న మార్గాల్లో మళ్లించాలని ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. ఈ ప్రతిపాదనలు ప్రస్తుతం చర్చల దశల్లో ఉండగా త్వరలోనే ఫైనల్ చేసే అవకాశాలున్నట్లు ఇరిగేషన్ వర్గాలు చెబుతున్నాయి. ఆ వెంటనే గోదావరి-పెన్నా అనుసంధానం ప్రాజెక్టుకు టెండర్లు పిలిచే ప్రయత్నాలు జరుగుతున్నట్లు చెప్పుకుంటున్నారు.

ముద్ద పెట్టి.. ముడుపులివ్వాల్సిందే !

(5వ పేజీ తరువాయి)

ఆదేశాలు ఉన్నాయి. అంతేకాక తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆర్టీసీ బస్సులు ఆయా డిపోల్లో కదిలే సమయాన్ని బట్టి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాల సమయంలో ఆయా జిల్లాల్లోని ప్రధాన బస్టాండ్లలోనే భోజనాలకు బస్సు నిలపాలన్న నిబంధనలు ఉన్నాయి. అయితే డ్రైవర్లు నిబంధనలు తుంగల్లో తొక్కి ప్రైవేటు హోటళ్ల వద్ద భోజనం ఉచితంతోపాటు రూ.200 చేతికి ఇస్తుండటంతో బైపాస్‌లపై బస్సులు నిలిపి భోజనం చేయిస్తున్నారు. దీంతో వేళకు రావాల్సిన బస్సులు రాకుండా, బస్సులోని ప్రయాణికులను భోజనాలు చేయమని చెప్పడంతో ఇప్పటికే వేరే ప్రాంతాల్లో నిలిపి తినిపించారన్న సమాధానాలు ఇస్తున్నారని హోటల్స్ యజమానులు అంటున్నారు.అంతేకాక ఆర్టీసీ జరిగే అధికారుల సమావేశాలకు, స్పోర్ట్స్‌మీట్‌లకు ఉచితంగా భోజనాలు సరఫరా చేయాలని అధికారులు ఆదేశాలు ఇస్తున్నారు. దీంతో హోటళ్ల యజమానులు ఇక్కట్లు పడుతున్నారు.

● గోప్యంగా సమాచారం

ఆర్టీసీలో జరిగే దందాలపై స్టాళ్ల, హోటళ్ల యజమానులు అక్కడ జరిగే అవినీతిపై గోప్యంగా ఆంధ్రజ్యోతికి సమాచారమిచ్చారు. త్వరలోనే విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి పూర్తి వివరాలు వెల్లడిస్తామని వారు పేర్కొన్నారు.

సాంకేతికత పెరిగినా.. తగ్గని పుస్తకం విలువ : డీఈవో

నెల్లూరు (సాంస్కృతికం) నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం సాంకేతిక విజ్ఞానం పెరిగినా పుస్తకం విలువ తగ్గలేదని, ఈ విషయాన్ని ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని డీఈవో బాలాజీరావు అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నెల్లూరు రేబాలవారివీధిలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఈవో మాట్లాడుతూ నేటి డిజిటల్ ప్రపంచంలో మునిగిపోయిన పిల్లలకు సమాజంలో ఎలా జీవించాలో నేర్పించే గ్రంథాలయాలను పరిచయం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందన్నారు. విద్యార్థులంతా ప్రతిరోజూ కొంత సమయం పుస్తకాల పఠనం కోసం కేటాయించాలని కోరారు. గాంధీ, నెహ్రూ, భగత్‌సింగ్ లాంటి ఎందరో మహనీయులు గ్రంథాలయాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ గంగాధర్ మాట్లాడుతూ గ్రంథాలయాలు దేవాలయాలతో సమానమన్నారు. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. సమాజంలో ఎలా జీవించాలో నేర్పించేవి గ్రంథాలయాల న్నారు. కలెక్టర్ ఆదేశాలతో సుమారు వందేళ్లకు పైగా చరిత్ర గల ఈ జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని ఆధునీకరించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఐ.పీఆర్ డీడీ కే.సదారావు మాట్లాడుతూ విద్యార్థులను గ్రంథాలయాల వైపు నడిపించాలని తెలిపారు. గతంలో అన్ని పాఠశాలల్లో గ్రంథాలయాలు, ఆటస్థలాలు గ్రంథాలయాలు ఉండేవని, నేడు ఆ పరిస్థితి లేదన్నారు. ప్రముఖ కవి పెరుగు రామకృష్ణ మాట్లాడుతూ గ్రంథాలయ ఏర్పాటుకు రూపకల్పన చేసిన మహనీయుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు అని గుర్తు చేశారు. మనజాతి సంపద గ్రంథాలయాలని, గ్రంథాలయాల పూర్వ వైభవానికి మరో ఉద్యమం చేపట్టాల్సిన



జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని బహుమతులు అందుకున్న చిన్నారులు

అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా మాట్లాడుతూ నేటితరం విద్యార్థులందరూ పుస్తకాలకు పునరంకితం కావాలన్నారు. వారంపాటు జరిగే ఈ ఉత్సవాల్లో అందరూ పాల్గొనాలని కోరారు. తొలుత ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని తొలి ప్రధాని నెహ్రూ చిత్రపటానికి అతిథులు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విజేతలకు అతిథులు మహాత్మాగాంధీ సత్యశోధన, ఆత్మకథ పుస్తకాలను అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సివిల్ ఇంజనీర్ రామకృష్ణ, ఎస్‌ఆర్‌ఐ శ్రీనివాస్, విశ్రాంత గ్రంథాలయ ఉద్యోగులు, పలువురు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



రేపటి నుంచి అయ్యప్ప మండల పూజలు

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని అయ్యప్పస్వామి ఆలయంలో శ్రీస్వామి అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యం లో మండల పూజలు ప్రారంభమవుతాయని ఆలయం చైర్మన్ జీ శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య తెలిపారు. గురువారం ఆలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మండల పూజల కరపత్రాలు ఆవిష్కరించారు. 41రోజులు ప్రత్యేక పూజలు జరుగుతాయని చెప్పారు. నిత్యం మధ్యాహ్నం 12గంటలకు అన్నప్రసాద వితరణ జరుగుతుం దన్నారు. అయ్యప్ప మాలాధారణ, ఇరుముడికి ఏర్పాట్లు చేశామన్నారు. దీక్ష అనంతరం శబరిమలైకు వెళ్లలేని భక్తులకు ఆలయంలోనే 18 మెట్లు ఎక్కి అయ్యప్పకు ఇరుముడి సమర్పించుకునే సౌకర్యం కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బట్టేపాటి నరేంద్రరెడ్డి, పావళ్ల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



మండల పూజల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దేవస్థానం పాలక మండలి

చెత్త కుప్పల్లో బాల్యం

ఈ చిత్రం చూశారా.. బడి బాట పట్టాల్సిన బాలలు చెత్తకుప్ప ల్లో వ్యర్థ పదార్థాలను ఏరుకుంటున్నారు. గురువారం ఉదయగిరి పట్టణంలోని గండిపాళెం మార్గంలోని 167-బీజీ జాతీ య రహదారి పక్కనే ఉన్న డంపింగ్ యార్డులో బాలలు ఇలా వ్యర్థాలు సేక రిస్తూ కనిపించారు. ఆ బాలలను బడికి వెళ్లడంలేదా అని ప్రశ్నించగా.. తమది వింజమూరని, తమ తల్లిదండ్రులు వలస జీవితం గడుపుతారన్నారు. ఇటీవల ఉదయగిరికి వచ్చామని, చెత్తలో దొరికే వ్యర్థ పదార్థాలను ఏరుకొని వాటిని విక్రయించగా వచ్చే సొమ్ముతో తమ పొట్ట నింపుకుంటామని చెప్పారు.

- ఉదయగిరి రూరల్, ఆంధ్రజ్యోతి)



ఇసుక రీచ్‌లకు టెండర్ల ఓపెన్

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 14 : ఇందుకూరుపేట మండలంలోని పల్లిపాళెం, ఆత్మకూరు మండలంలోని అప్పారావు పాళెం ఇసుక రీచ్‌లకు సంబంధించి టెండర్లను జాయింట్ కలెక్టర్ కార్తీక్ కలెక్టరేట్ శంకరన్ హాల్లో గురువారం ఓపెన్ చేశారు. అప్పారావుపాళెం రీచ్‌కు మొత్తం 6 సీల్ టెండర్లు రాగా రెండు రిజెక్టు అయ్యాయి. మిలీనియం స్టీల్స్ ఆఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఈ రీచ్‌ను దక్కించుకుంది. పల్లిపాడు రీచ్‌కు 8 టెండర్లు రాగా 3 తిరస్కరణకు గురయ్యాయి. సీ భరణి కుమార్ ఆ రీచ్‌ను దక్కించు కున్నట్లు జేసీ కార్తీక్ ప్రకటించారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రాజెక్టులకు భూసేకరణ పూర్తి చేయండి

● అధికారుల సమీక్షలో కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 14 : జిల్లాలోని అభివృద్ధి ప్రాజెక్టులకు భూసేకరణను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. గురువారం భూసేకరణ విషయమై ఆయన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష జరిపారు. ఎన్‌హెచ్‌ఏఐ, రైల్వే, ఆర్‌అండ్‌బీ, మెగా ఇండస్ట్రియల్ హబ్ తదితర ప్రాజెక్టులకు పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పూర్తి చేయాలన్నారు. రైల్వే ప్రాజెక్టులకు కొన్ని చోట్ల మ్యూటేషన్లు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. భూసేకరణలో పురోగతికి ఆర్డీవోలు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జేసీ కార్తీక్, సబ్ కలెక్టర్లు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఏడుగురి గైర్హాజరు

వెంకటాచలం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో గురువారం మధ్యాహ్నం జరిగిన డిగ్రీ మూడవ సెమిస్టర్ పరీక్షలో 7గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారిని మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలో 130 మంది హాజరయ్యారు.

కొమ్మరపూడిలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

నెల్లూరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ మండలం కొమ్మరపూడి గ్రామంలో ఓ వ్యక్తి గురువారం గడ్డి మందుతాగి బలవన్మరణానికి యత్నించాడు. స్థానికుల సమాచారం మేరకు... గ్రామానికి చెందిన ఉప్పలూరు మల్లికార్జున్ నాయుడుకు అదే గ్రామానికి చెందిన మరో మహిళతో ఏర్పడ్డ వివాదం ముదిరింది. మాటా మాట పెరిగి ఘర్షణకు దారితీయడంతో మనస్తాపానికి చెందిన మల్లికార్జున్ గడ్డిమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన నెల్లూరులోని జీజీహెచ్‌కు తరలించారు. ఘర్షణకు కారణమైన మహిళ గ్రామంలో మద్యం బెల్టు షాపు నిర్వహిస్తుండగా ఇటీవల దానిని అధికారులు అడ్డుకున్నారు. దీని వెనుక మల్లికార్జున్ ఉన్నాడని అనుమానించిన మహిళ ఈ ఘర్షణకు పాల్పడినట్లు స్థానికులు పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

ఆర్టీసీ డ్రైవరు అప్రమత్తతతో

త్రుటిలో తప్పిన ప్రమాదం

ఆత్మకూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డ్రైవరు అప్రమత్తతతో పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ప్రమాదం త్రుటిలో తప్పింది. వివరాలిలా ఉన్నాయి. బస్టాండ్ ప్రాంగణంలో గురువారం మధ్యాహ్నం నెల్లూరు వైపు వెళ్లాల్సిన ఆర్టీసీ బస్సును ఆపి డ్రైవరు భోజనానికి వెళ్లాడు. ఈక్రమంలో సుమారు 20 మంది ప్రయాణికులు బస్సు ఎక్కి కూర్చున్నారు. ఇంతలో ఆగిఉన్న బస్సు ఒక్కసారిగా వెనుకకు కదలి సమీపంలో దుకాణాల వద్దకు నెమ్మదిగా దూసుకువెళ్లింది. దీంతో ప్రయాణికులు, స్థానికులు భయంతో కేకలు వేయడంతో డ్రైవర్ హుటాహుటీన వచ్చి బస్సును నిలుపుదల చేశాడు. ఈఘటనలో దుకాణాల వద్ద ఉన్న నాలుగు మోటారుబైకులు దెబ్బతిన్నాయి. అక్కడ ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈవిషయమై ఆర్టీసీ డీఎం కరీముల్లాను వివరణ కోరగా.. బస్సు హ్యాండ్‌బ్రేక్ ఫెయిల్ అయిందేమోనని పరిశీలించామని, కానీ అలాంటిది ఏమీ జరగలేదని, బస్సులో డ్రైవర్ సీటు వెనుక ఉన్న ప్రయాణికుల కాళ్లు హ్యాండ్‌బ్రేక్‌కు తగలడంతో బస్సు కదిలి ఉండవచ్చని తెలిపారు.

విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు

● మత్తులో జోగుతున్న యువత

కొడవలూరు నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గంజాయి విక్రయాలు విచ్చలవిడిగా సాగుతుండడంతో యువకులు మత్తుకు బానిసలవుతున్నారు. గంజాయి మత్తులో గొడవలు పడుతున్నారు. మండలంలోని నార్తురాజుపాళెంను ప్రధాన అడ్డాగా మార్చి ఈ వ్యాపారం సాగిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన గంజాయిని 10 గ్రాముల ప్యాకెట్ రూ. 100 నుంచి రూ. 150 వరకు అమ్ముతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా అధికారులు స్పందించి గంజాయి విక్రయాలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి జరిమానా

ఉదయగిరి రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి రూ.11 వేలు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షేక్ జమీర్‌బాషా అనే వ్యక్తి బుధవారం రాత్రి మద్యంసేవించి తన అంబులెన్స్ వాహనంతో పట్టణంలో ఓ మోటార్‌బైక్‌ను ఢీకొట్టడంతోపాటు పలువురు వాహనదారులను భయభ్రాంతులకు గురిచేశాడన్నారు. దీంతో వాహనంతోపాటు అతన్ని అరెస్టు చేశామన్నారు. ఈమేరకు స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ భారతి ఎదుట జమీర్‌బాషాను హాజరుపర్చగా మద్యం సేవించి వాహనం నడిపినందుకు రూ.10 వేలు, వాహనానికి రిజిస్ట్రేషన్ లేనందున రూ.1,000లు కలిపి మొత్తం రూ.11 వేలు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	102
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	190
స్కిన్‌లెస్	214
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7115
వెండి కిలో ధర	రూ. 56,920
వెండి ఒక గ్రాము	రూ.92.30

జువెనైల్ హోంకు

కొత్తవెల్లంటి బాలుడు

నెల్లూరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ మండలం కొత్తవెల్లంటి గ్రామంలో ఇటీవల గిరిజన బాలికను వేధింపులకు గురిచేసి ఆ బాలిక ఆత్మహత్యాయత్నానికి కారకుడైన బాలుడిని రూరల్ పోలీసులు రెండు రోజుల క్రితం తిరుపతిలోని జువెనైల్ హోంకు తరలించి నట్లు తెలిసింది. గ్రామంలో పదో చదువుతున్న బాలికను సదరు బాలుడు ప్రేమపేరుతో వేధింపులకు గురి చేశాడు. అవి మితిమీరడంతో బాలిక చదువుకూడా మానేసింది. అయిన వేధింపులు ఆపకపోవడంతో ఈ నెల 7వ తేదీన బాలిక బలవన్మరణానికి యత్నించింది. ఈ ఘటనపై విచారణ చేపట్టిన రూరల్ పోలీసులు సదరు బాలుడిని బాలనేరస్తుల పాఠశాలకు తరలించారు.

'అభయహస్తం'...

రిక్తహస్తం !

● పొదుపు మహిళల వివరాల క్రమబద్ధీకరణ ఏదీ ?
● ధీమా ఇవ్వని బీమా పథకం ● స్కీమ్ నుంచి తప్పుకున్న 2.50లక్షల మంది
● కూటమి ప్రభుత్వంపై మహిళల ఆశలు



డీఆర్‌డీఏ కార్యాలయం

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పొదుపు సంఘాల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టిన అభయ హస్తం పథకం గత వైసీపీ పాలనలో నీరుగారింది. 2009లో ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇది బీమా పథకం. లబ్ధిదారు లకు 60 ఏళ్ల తరువాత పింఛన్ ఇస్తారు. ఈ పథకంలో చేరే పొదుపు సంఘాల సభ్యుల వివరాలను ప్రతి ఏటా క్రమబద్ధీకరించాలి. కాని వైసీపీ ప్రభుత్వం గద్దెనెక్కిన తరువాత ఒకసారి మాత్రమే క్రమబద్ధీకరించింది. ఆ తరువాత ఆ ఊసేలేదు. దీంతో జిల్లాలో ఈ పథకం నుంచి 2.50 లక్షలమంది వైదొలగారు.

● **పథకం లబ్ధి ఇలా...**

అభయ హస్తం పథకంలో 18 నుంచి 59 ఏళ్ల లోపు వారికి సభ్యత్వం కల్పించారు. ఒక్కొక్క సభ్యురాలు ఏడాదికి కనీసం రూ. 365 వాటాధనం, మరో రూ. 15 రుసుం చెల్లించాలి. దానికి సమాన మొత్తంలో ప్రభుత్వ వాటా కలిపి 60 ఏళ్లు నిండాక లబ్ధిదారులకు నెలకు రూ. 500తో పాటు ప్రభుత్వం అందించే ఇతర పింఛను పొందే అవకాశం కల్పించారు.

● **నీరుగార్చిన వైసీపీ**

ఈ పథకాన్ని వైసీపీ ప్రభుత్వం నీరుగార్చటంతో ఈ పథకంలో కొనసాగడానికి పొదుపు సంఘాల సభ్యులు ఇష్టపడలేదు. ఈ పథకంలో చేరిన లబ్ధిదారులకు 60 ఏళ్లు నిండిన తరువాత పెన్షన్‌తో పాటు జనశ్రీయోజన, ఉపకార వేతనాలు వంటి ప్రయోజనాలు పొందేవారు. అంతే కాకుండా పథకంలో చేరిన సభ్యురాలి కుటుంబంలో ఎవరైనా చనిపోతే రూ. 30 వేల నుంచి రూ. 75వేల వరకు బీమా వర్తిస్తుంది. 9, 10 తరగతులు, ఐటీఐ చదువుకునే విద్యార్థులకు ఏటా రూ.1200 వంతున ఉపకార వేతనం అందేది. వైసీపీ అధికారంలోకి వచ్చాక వాటిని రద్దు చేసి బీమా సంస్థ నుంచి వాటా సొమ్మును వెనక్కి తీసుకున్నట్లు సమాచారం. తరువాత ఇది పెన్షన్ పథకం గానే మిగిలిపోయింది. గతంలో రెండేళ్ల ప్రీమియం రూ.750 ఒకే సారి చెల్లించాలని సూచించడంతో చాలామంది రెన్యూవల్ చేసుకోలేదు.

● **రూ. 3 లక్షల నుంచి 52 వేలకు...**

జిల్లాలో 39,000 వేల పొదుపు సంఘాలు ఉన్నాయి. వీటిలో నాలుగు లక్షల మంది సభ్యులు ఉన్నారు. వీరిలో అభయహస్తం పథకం ప్రవేశపెట్టినప్పుడు మూడు లక్షల మందికి పైబడి పొదుపు సంఘాల సభ్యులు చేరారు. ప్రస్తుతం 50,576 పొదుపు సంఘాల సభ్యులు ఈ పథకంలో సభ్యత్వం కలిగి ఉన్నారు. 16986 మంది అభయహస్తం పథకం కింద పెన్షన్ పొందుతున్నారు. ఇవి అధికారిక లెక్కలు. అయితే ఆన్‌లైన్‌లో వారి సమాచారం సరిగా కనిపించటం లేదు. వైసీపీ హయాంలో ఈ పథకం నుంచి లక్షలాది మంది వైదొలిగారు. మృతి చెందిన వారి నామినీలకు, పథకం వద్దనుకున్న సభ్యులకు వారు చెల్లించిన ప్రీమియం తిరిగి చెల్లించాలి. కొందరికి చెల్లింపులు చేసినట్లు సమాచారం. ఇంకొందరికి చెల్లింపులు చేయాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఈ పథకం పూర్తి స్థాయిలో అమలవుతుందని లబ్ధిదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

పింఛన్ అందచేస్తున్నాం

జిల్లాలో అభయహస్తం పథకం కింద 16,986 మందికి ప్రతినెలా పింఛన్ అంద చేస్తున్నాం. ఈ పథకానికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఏదైనా సమాచారం వస్తే వారికి తెలియచేస్తాం.

- నాగరాజకుమారి, డీఆర్‌డీఏ, పీడీ



సోమశిలకు 8,254 క్యూసెక్కుల వరద

అనంతసాగరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువనుంచి గురువారం 8,254 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 68.997 టీఎంసీల నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,150, కండలేరుకు తెలుగుగంగ ద్వారా 3000, ఉత్తర కాలువకు 550, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

నేడు ఐటీఐ కళాశాలలో

ఉద్యోగమేళా

నెల్లూరు(విద్య), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ, ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్తంగా నెల్లూరు వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో శుక్రవారం ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కే శ్రీధర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కంపెనీలు, సంస్థల ప్రతినిధులు పాల్గొని యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తారని తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు, ఐటీఐ, డిప్లమో చదివిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9494456326, 6301529271 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా

డాక్టర్ నాగ రాజమన్నార్



బాధ్యతలు తీసుకుంటున్న డాక్టర్ నాగరాజమన్నార్

నెల్లూరు (వైద్యం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ వీరవెంకట నాగ రాజమన్నార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మార్కాపురం వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ ఇటీవల ఇక్కడికి బదిలీ అయ్యారు. నెల్లూరు ప్రభుత్వ వైద్య కళాశాలను రాష్ట్రంలోనే ఉన్నతంగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు.

సమస్యలు పరిష్కరించకుంటే

సమ్మెకు దిగుతాం

● 108 వాహన ఉద్యోగులు

ఉదయగిరి రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): 108 అంబులెన్స్ వాహనాల్లో పని చేసే ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకుంటే ఈనెల 25వ తేదీ నుంచి సమ్మెకు దిగుతామని ఉదయగిరి 108 వాహన ఉద్యోగులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 108 సర్వీసుల బాధ్యతను ప్రభుత్వమే నిర్వహించాలని, సకాలంలో వేతనాలు చెల్లించాలని, ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు.

11 మంది వెల్ఫేర్ అసిస్టెంట్లకు

షోకాజ్ నోటీసులు

వరికుంటపాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలో విధులు నిర్వహిస్తున్న 11 మంది వెల్ఫేర్ అసిస్టెంట్లకు గురువారం ఎంపీడీవో వేణుగోపాల్‌రావు షోకాజ్ నోటీసులు అందజేశారు. ఎన్‌పిసి కింద బ్యాం కులు, పోస్టాఫీసుల్లో ఖాతాదారులకు ఆధార్ అనుసం ధానం చేయడం, పాఠశాలలో మరుగుదొడ్ల ఫోటోలు తీయడం వంటి కార్యక్రమాలలో నిర్లక్ష్యంగా వ్యవహరించ డంతో నోటీసులు అందజేశారు. ఆ ఉద్యోగులు మూడు రోజుల్లో కార్యాలయానికి చేరుకొని సంజాయిషీ అందజే యాలని సూచించారు.

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

● యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రామారావు ● నెహ్రూకు కాంగ్రెస్ శ్రేణుల ఘన నివాళి



నెహ్రూకు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నెల్లూరు (వైద్యం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని యువజన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామారావు డిమాండ్ చేశారు. గురువారం నెల్లూరులోని ఇందిరా భవన్‌లో పార్టీ నేతల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలని ప్రక టించిన మంత్రి లోకేష్ ఇప్పుడు ఆ ప్రస్తావనే తీసు కురావడం లేదని ఆరోపించారు. గంజాయి, మత్తు పదార్థాలను అరికట్టాలన్నారు. దేశ మొదటి ప్రధా ని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భం గా ఆయన చిత్రపటానికి నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జాతీయ యువ జన కాంగ్రెస్ కార్యదర్శి మమతా నారపరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి, యువ జన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి గణేష్, నాగిరెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

దేశ వైభవంలో నెహ్రూ పాత్ర కీలకం : చేవూరు

భారతదేశ పునర్నిర్మాణంలో మాజీ ప్రధాని నెహ్రూ కీలక పాత్ర పోషించారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి అన్నారు. నెహ్రూ జయంతి సందర్భంగా గురువారం నగరంలోని నెహ్రూ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పంచవర్ష ప్రణాళిక, భారీ ప్రాజెక్టుల నిర్మాణం, వ్యవసాయ రంగం విధానాలను నెహ్రూ సమర్థవంతంగా అమలు చేశారని కొనియాడారు. ప్రస్తుతం బాలలు సంక్షేమం, హక్కుల విషయంలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుచి ఉడత వెంకట్రావు, జిల్లా ఉపాధ్యక్షుడు బాల సుధాకర్, సంజయ్‌కుమార్, అల్లాఉద్దీన్, మల్లికార్జునరెడ్డి, హుస్సేన్‌బాషా, మోహన్, గణేష్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై ఉక్కుపాదం మోపాలి

● జిల్లా వైద్యాధికారి పెంచలయ్య



కేన్సర్‌పై అవగాహన నిర్వహిస్తున్న జిల్లా వైద్యాధికారి

తోటపల్లిగూడూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీ వైద్య సిబ్బంది కలిసికట్టుగా పనిచేసి కేన్సర్‌పై ఉక్కుపాదం మోపాలని జిల్లా వైద్యాధికారి పెంచలయ్య పిలుపునిచ్చారు. గురువారం వరిగొండ పీహెచ్‌సీలో నిర్వహించిన కేన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తో సాధ్యం కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడారు. వరిగొండ పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బందితో కలిసి ప్రతిరోజు ఐదు గృహాలకు సర్వే చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. విధుల్లో పాల్గొనేవారు ఎవరూ అలసత్వం వహించరాదని సూచించారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ భాస్కర్, పీహెచ్‌సీ వైద్యాధికారులు రాధిక, అశోక్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వినుత, శాంతి, నవీన్, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సిద్ధం కావాలి

● నెల్లూరు ఆర్డీవో అనూష

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 14 : జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధం కావాలని నెల్లూరు ఆర్డీవో అనూష సూచించారు. గురువారం కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఎన్నికల అధికారులతో ఆమె సమీక్ష జరిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. త్వరలో అన్నీ మండల కేంద్రాల్లో పీవోలు, ఏపీవోలకు శిక్షణా ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్టు ఎస్‌ఈ వెంకట రమణారెడ్డి, ఈఈ మల్లికార్జున, తహసీల్దార్లు పాల్గొన్నారు.

రేపు పెంచలకోనకు విధుశేఖర భారతి

మహాస్వామి రాక

రాపూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాపూరు మండలం ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనను శ్రీ శృంగేరి జగద్గురువులు భారతీతీర్థ మహాస్వామి ఈనెల 16వ తేదీ సాయంత్రం దర్శించుకోనున్నారని ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులందరూ పాల్గొనాలని కోరారు.

19న ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని సామగ్రి వేలం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని సామగ్రిని వేలం వేస్తున్నట్లు నెల్లూరు డిపో మేనేజర్ ఆయేషా బేగం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేయడంతో వాటిలోని సామగ్రిని ఏపీ స్టేట్ బేవరేజస్ కార్పొరేషన్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 171 ఫ్రీజర్లు, 160 ఇన్వర్టర్లు, 165 క్యాష్ చెస్టులు, 324 స్కాన ర్లు, 165 నగదు కౌంటింగ్ మిషన్లను ఈ నెల 19వ తేదీ ఉదయం 10 గంటలకు గోదాము వద్దనే బహిరంగ వేలం వేస్తామని డీఎం తెలిపారు. పూర్తి వివరాల కోసం స్టోర్ ఆఫీసర్ 9000015109, 98486 27590 నెంబర్లను సంప్రదించాలని కోరారు.



స్తంభం నాటారు.. తీగలు లాగడం మరిచారు !

స్థానిక వాయునందన ప్రెస్‌వీధిలో దెబ్బతిన్న స్తంభం ప్రక్కనే మరో స్తంభం నాటి సంవత్సరాలు గడుస్తున్నా విద్యుత్ తీగలు మార్చుట మరిచారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఆ మార్గం లో 11కెవి విద్యుత్ స్థంభం కూలేందుకు సిద్ధంగా ప్రమాధకరం గా ఉన్నప్పటికి అధికారులు పట్టించుకోవటం లేదన్న విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. అధికారులు స్పంధించి విద్యుత్ లైన్లు మార్చి దెబ్బతిన్న స్థంభం తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి)

నిదరోతున్న నిఘా నేత్రాలు

కలిగిరి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కావలి, ఉదయగిరి, కందుకూరు, నెల్లూరు ప్రాంతాలకు వెళ్లడానికి కలిగిరి ప్రధాన కూడలిగా ఉంది. అ యితే పట్టణ పరిధిలోని కలిగిరమ్మ, తహసీల్దా రు కార్యాలయం కూడళ్లలో ఏర్పాటు చేసిన నిఘానేత్రాలు(సీసీ కెమెరాలు) కొంతకాలంగా పనిచేయడం లేదు. ఫలితంగా నిఘా కొరవడింది. సుమారు ఐదేళ్ల క్రితం పోలీసులు పట్టణంలోని రెండుచోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అయా ప్రాంతాల్లో ట్రాఫిక్ నియం త్రణ, ఈవ్‌టీ జింగ్, గొడవలు జరిగినపుడు సీసీటీవీ కెమెరాల ఫుటే జ్‌లను పరిశీలించేందుకు కంట్రోల్ వ్యవస్థను స్టేషన్‌లో ఏర్పాటు చేశారు. వీటి పనితీరుపై పోలీసులు దృష్టి సారించక పోవ డంతో ప్రస్తుతం నిఘా కొరవడింది.

కొత్తవి ఏర్పాటు చేస్తాం..

పట్టణ సీసీ కెమెరాలు ప్రస్తుతం పనిచే యడంలేదు. దాతలు, స్థాని కుల సహకారంతో పాత వాటి స్థానంలో కొత్తవి ఏ ర్పాటు చేసి, వాడుకలోకి తీసుకువస్తాం.

-ఎస్ఐ ఉమాశంకర్





కలిగిరి-సంగం కూడలిలో పనిచేయని సీసీ టీవీ కెమెరాలు









ఘనంగా బాలల దినోత్సవం

● నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఉపాధ్యాయులు



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న హెచ్‌ఎం షీబారాణి



అభినందిస్తున్న డీఎస్పీ శ్రీధర్, కమిషనర్ శ్రావణ్‌కుమార్

కావలి టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ జేబీ ఎంఎం హాల్‌లో రామ్ సెంటర్ ఛైర్మన్ దొడ్ల మనోహర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ముఖ్య అతిథులుగా డీఎస్పీ శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ పాల్గొని పోటీల్లో ప్రతిభ చూపిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సం దర్భంగా చిన్నారులుస్వాతంత్ర్య సమర యోధుల వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో విశ్వోదయా రెక్టార్ వినయ్‌కుమార్ రెడ్డి, తాతిరెడ్డి పాల్గొన్నారు.

● కొండాపురం, నవంబరు 14: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బాలల దినోత్సవం జరుపుకున్నారు. స్థానిక సాయిపేట దామా చినబాబు మెమోరియల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నెహ్రూ చిత్రప టానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● బిట్రగుంట, నవంబరు 14. (ఆంధ్రజ్యోతి) స్థానిక ఏనుగులబావి పంచా యతీలోని ప్రాథమికోన్నత పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం షీబారాణి విద్యార్థులతో బంగారు బాల్యం ప్రతిజ్ఞ చే యించారు. బోగోలు ప్రాథమిక పాఠశాలలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవా లు గ్రంథాలయ అధికారి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్య విజయకుమార్, అనీఆల్‌బట్, రాధయ్య ఉన్నారు.

● అనంతసాగరం, నవంబరు 14: మండలంలోని కామిరెడ్డిపాడు, చిలకలమర్రి ఉన్నత పాఠశాలల్లో గురువారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు వసుంధరదేవి, సురేష్ పాల్గొన్నారు.

● ఉదయగిరి రూరల్, నవంబరు 14: దేశ మొట్ట మొదటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవ వేడుకలను గురువారం పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఉర్దూ బాలికల ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో షేక్ మస్తాన్‌వలి విద్యార్థులచే కేక్ కట్ చేయించి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మండలంలోని వెంగళరావునగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయురాలు షబాన తన కుమారుడుచే శుభ్‌దిన్ భోజన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు.

● దుత్తలూరు: స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకల్లో ఎంపీడీవో మీసాల వెంకటేశ్వర్లు పాల్గొని నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షేక్ నజీముల్లా, నాగేంద్ర, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● సీతారామపురం, నవంబరు 14: జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా గురువారం మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో బాలలదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.



ఉదయగిరి: కేక్ కట్ చేయిస్తున్న ఎంఈవో మస్తాన్‌వలి



అనంతసాగరం: బహుమతులు ఇస్తున్న వసుంధరాదేవి

గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభం



సంగం: నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు

అల్లూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాపూజీ పార్కులోని గ్రంథాలయంలో లైబ్రరీ నిర్వాహకులు కోటేశ్వరి ఆధ్వర్యంలో గురువారం 57వ జాతీయ గ్రంథాల వారోత్సవాలను ప్రారంభించారు. ముందుగా జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. వారంరోజులపాటు నిర్వహించే కార్యక్రమంలో రోజుకో అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని నిర్వాహకురాలు కోటేశ్వరి తెలిపారు. అదేవిధంగా పుస్తక ప్రదర్శనతోపాటు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, వక్తృత్వపు పోటీలను నిర్వహించి బహుమతుల అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. జ్ఞాన భాండాగారాలు

కొండాపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రహీమ్ స్థానిక గ్రంథాలయంలో నిర్వహించిన వారోత్సవాల ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. లైబ్రేరియన్ కొండయ్యతో కలిసి నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు విష్ణు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

ఆత్మకూరు, నవంబరు 14: ఆత్మకూరు పట్టణంలోని గ్రంథాలయంలో గురువారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన ఏర్పాటుచేశారు. ముందుగా ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ ఓ శ్రీనివాసరాజు, పలువురు పట్టణ ప్రముఖులు సరస్వతీ, జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటాలకు పూలమాలల వేసి వారోత్సవాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత గ్రంథపాలకుడు ఏ గోవిందరెడ్డి, లైబ్రరి రికార్డు అసిస్టెంట్ ఎల్ తనూజ పాల్గొన్నారు.

శాఖాగ్రంథాలయంలో..

సంగం, నవంబరు 14: స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బుజ్జయ్య జాతీయ జెండాను ఎగరవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సరస్వతీదేవి, నెహ్రూ చిత్ర పటాలకు పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ రవీంద్రనాథ్‌రెడ్డి , పీడీ అంజయ్య, పాఠకులు పాల్గొన్నారు.



గ్రంథాలయ వారోత్సవాల గోడపత్రికతో విద్యార్థులు



ఆత్మకూరు: పూజలు చేస్తున్న లైబ్రేరియన్ శ్రీనివాసరాజు, విద్యార్థులు

ప్రజా సమస్యలపై సీపీఎం నాయకుల ధర్నా



కావలి: ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం శ్రేణులు



ఆత్మకూరు: ఆర్డీవో పావనికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కావలి టౌన్, నవంబరు 14: సీపీఎం నాయకులు గు రువారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి కార్యాలయంలోని అధికారులకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి పెంచులయ్య మాట్లాడారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం కోస ధర్నా చేపట్టామన్నారు. ట్రూఅప్ చార్జీల సర్దుబాటు పేరుతో కోట్ల రూపాయలు ప్రజలపై భారం మోపడం దుర్మార్గమన్నారు. విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్లకు తాము వ్యతిరేకమని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి గత ప్రభుత్వ విధానాలను కొనసాగిస్తుందని ఆరోపించారు. ప్రజా సమస్యలు పరిష్కారం అయ్యేవరకు నిరంతరం పోరాటం చేస్తామన్నారు. కార్య క్రమంలో మధుసూధన్‌రావు, వెంకయ్య, తిరుపాల్, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

● ఆత్మకూరు, నవంబరు 14: ప్రజా సమస్యలు పరిష్కరించాలని సీపీఎం తలపెట్టిన ప్రజాపోరు యాత్రలో భాగంగా గురువారం, ఆత్మకూరు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక పాతబస్టాండ్ సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కె డేవిడ్‌రాజు, సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు ఆత్మకూరు నాగయ్య, నాగేంద్ర, పియస్థానీ తదితరులు పాల్గొన్నారు.

●అనంతసాగరం, నవంబరు 14: స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద గురువారం సీపీఎం నేతలు పెరిగిన నిత్యవసర ధరలు, కరెంటు చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు. కార్యక్రమంలో అన్వర్‌బాష, మీరామొహిద్దిన్, అంజయ్య, కాలేషా పాల్గొన్నారు.

●ఉదయగిరి రూరల్, నవంబరు 14: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో రైతులు, కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ విద్యుత్ ట్రూఅప్ చార్జీలను తగ్గించాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కాకు విజయమ్మ, సీపీఎం, సీఐటీయూ నాయకులు కోడె రమణయ్య, గడ్డం నాగేశ్వరరావు, పందిళ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● ఏఎస్ పేట నవంబరు 14: నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని నాయకులు స్థానిక తహసీల్దారు కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దారు శ్రీరామకృష్ణకు వినతిపత్రం అందించారు.

కూటమి ప్రభుత్వం మనుగడ సాగించడం కష్టం

● మాజీ మంత్రి కాకాణి

కావలి టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి కూటమి ప్రభుత్వం ఐదేళ్ల పాలన కొనసాగించడం కష్టమని మాజీ మంత్రి వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి తెలిపారు. గురువారం ముసునూరులోని మాజీ ఎమ్మెల్యే నివాసంలో ఆయనతో కలిసి కాకాణి విలేకరులతో మాట్లాడారు. ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు అపద్ధపు హామీలను నమ్మి కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు గెలిపించారని ప్రభుత్వం నుంచి ప్రజలకు ఆశించిన పథకాల లబ్ధి చేకూరడం లేదన్నారు. తక్కువ కాలంలోనే ప్రభుత్వంపై విపరీతమైన అసంతృప్తి వచ్చిందని ఆరోపించారు. 2027లో జమిలి ఎన్నికలు రానున్నాయని ఈ ఎన్నికల్లో తిరిగి జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైసీపీ ప్రభుత్వం రావడం ఖాయమని జోస్యం చెప్పారు. పోలీసులు ఒళ్ల దగ్గర పెట్టుకుని పని చేయాలని అధికారం ఏ పార్టీకి శాశ్వతం కాదని వైసీపీ కార్యకర్తల జోలికొచ్చినోళ్లని గుర్తుపెట్టుకుంటామని తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి కాకాణి, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి

అభివృద్ధి పనులు వేగవంతం

● కట్టా శ్రీనివాసులు, ఎంపీడీవో, లింగసముద్రం



లింగసముద్రం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 16గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. అలాగే ఉపాధిహామీ పథకం పనులతో 80శాతం కూలీలకు ఉపాధి కల్పిస్తున్నట్లు ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు తెలిపారు.

ఈ వారం ముఖాముఖి

? ఏ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

! 14గ్రామ పంచాయతీలలో రూ.3కోట్లతో సీసీ రోడ్లు వేయిస్తున్నాం.

? ఉపాధిహామీ పనులు ఎలా జరుగుతున్నాయి?

! ప్రతిరోజూ 2000 మందికి పైగానే ఉపాధి కల్పిస్తున్నాం. బోగస్ మస్టర్లు లేకుండా చర్యలు తీసుకున్నాం.

? జ్వరాలు రాకుండా ఏ చర్యలు చేపట్టా రు ?

! గ్రామాలలో జ్వరాలు వ్యాపించకుండా పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో బ్లీచింగ్ చల్లిస్తున్నాము. మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయిస్తున్నాం. రెండు, మూడు రోజులలో దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం.

? పింఛన్ల పంపిణీ ఎలా ఉంది ?

! సచివాలయ సిబ్బందితో మొదటి రోజే 96 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్నాం. ఈ పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు లేవు.

న్యూస్ బాక్స్

బోగోలులో కుండపోత వర్షం

బిట్రగుంట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలోని తాళ్లూరు, విశ్వనాథరావుపేట, నాగులవరం, జక్కేపల్లిగూడూరు పంచాయతీలో వాగులు, కాలువలు పా రుతుండటంతో చెరువుల కలుజులు ఎక్కి పారాయి. చెరువు కట్టలు తెగకుండా అధికారులు నేతలు పర్యవేక్షించారు.

బ్లూమ్స్ న్యూస్ లెటర్ ప్రారంభం

బిట్రగుంట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల్లో గురువారం బ్లూమ్స్ న్యూస్ లెటర్ ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ పీవీఎన్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏవో ఆర్వీ రమణారెడ్డి, సునీల్‌రెడ్డి, మాల్యాద్రిరెడ్డి, అన్ని విభాగాల అధ్యాపకులు, ఉన్నారు.

సమస్యల సవరణకే గ్రామసభ

అల్లూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో ఏర్పడిన సమస్యలను సవరించుకొని పరిష్కరించుకునేందుకే రాష్ట్ర ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ తెలిపారు. ఇస్కపల్లిలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. నూతన ప్రభుత్వంలో భూ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలు పూర్తిస్థాయిలో వెబ్‌ల్యాండ్‌లో మ్యుటేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రంజిత్, డీటీ ఉరూజ్, ఆర్ఐ ప్రభుదీప్, విఆర్వోవ మల్లికార్జున, పాపనబోయిన జగన్‌మోహన్‌రావు, రవ్వా హరికుమార్ పాల్గొన్నారు.

పోలేరమ్మ సన్నిధిలో ఇరుముడులు

బిట్రగుంట, నవంబరు 14. (ఆంధ్ర జ్యోతి): కోవూరుపల్లి పోలేరమ్మ ఆలయ ప్రాంగణంలో గురువారం భవానీ దీక్షదారులు ఇరుముడులు కట్టుకున్నారు. 40మంది మాలధారణ భక్తులు మండల కాలదీక్ష పూర్తి చేసుకుని కొండకు బయలుదేరారు. ఆదెయ్యగురుస్వామి ఆధ్వర్యంలో సూర్యనారాయణరెడ్డి గురుస్వామి, లక్ష్మయ్య గురుస్వాములు దుర్గేశ్వర భవానీకి గురుముద్ర అందజేశారు. నాటకరాణి భాస్కర్ అమ్మవారికి పూలంగి సేవ చేశారు.

ప్రణాళికలతోనే అభివృద్ధి

సీతారామపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల అభివృద్ధికి ముందస్తు ప్రణాళికలు దోహదపడతాయని ఎంపీడీవో భాస్కర్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల శిక్షణా తరగతులు ఎంపీడీవో భాస్కర్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల సర్పంచులు,ఎంపీటీసీలు, మండల అధికారులు, కార్యదర్శుల పాల్గొన్నారు.

● చేజర్ల, నవంబరు 14 : స్థానిక ఎంపిడీవో కార్యాలయంలో ప్రజాప్రతినిధులకు, పంచాయతీ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపిపి విజయభాస్కర్‌రెడ్డి, ఎంపిడీవో విజయలలిత, తహసీల్దారు మస్తానయ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇవోపిఆర్డీ రామయ్య సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆరోగ్య సర్వే

సీతారామపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గంధంవారి పల్లి గ్రామ పంచాయతీలో వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టి క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వప్న సూపర్‌వైజర్ అబ్దుల్ మజీద్, ఎంపిహెచ్ శ్రీనివాసులు, విజయ,ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ

సంగం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏఎస్ కండ్రికలో కూడలిలో ల్యాంకో ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధుల ఆశ్రమం నిర్వాహకురాలు రామలమ్మమ్మ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.

మనుబోలు బహుత్ అచ్చా..

● ట్రైనీ కలెక్టర్ల కితాబు



నెహ్రూ వేషధారణలో ఉన్న చిన్నారులతో శిక్షణ కలెక్టర్లు

మనుబోలు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉత్తర భారతానికి చెందిన వినోద్‌కుమార్ మీనా, మోహన్‌లాల్, సిద్దార్థ్ శ్రీవాత్సవ్, సాయలి సతీష్ షిండే అనే నలుగురు ట్రైనీ కలెక్టర్ల బృందం శిక్షణలో బాగంగా మనుబోలు పంచాయతీలో గురువారం సుడిగాలి పర్యటన చేశారు. స్థానిక పంచాయతీ బహుత్ అచ్చా..నైస్ మండల్ అంటూ శిక్షణ కలెక్టర్ల బృందం కితాబు నిచ్చింది. సచివాలయాల విధి నిర్వహణ, ప్రజల జీవన విధానం, వారి స్థితిగతులు, పంచాయతీ ఆదాయమార్గాలు, సాగునీటి సరఫరా తదితర అంశాలపై కలెక్టర్ల బృందం 8గంటల పాటు కలియతిరిగి క్షుణ్ణంగా పరిశీలించారు. తెలుగుభాష రాకపోవడంతో హిందీ, ఆంగ్లంలో తర్జుమా చేయించుకుని అభిప్రాయాలను సేకరించి నమోదు చేసుకున్నారు. చిన్నారులతో కలిసి భోజనం చేశారు. మహిళలతో కూర్చుని చర్చించారు. పాఠశాలల్లో చెత్త ఊడ్చడం, కళాశాలలో చెట్లు నాటడం వంటి కార్యక్రమాలు చేయడంతో మనుబోలు ప్రజలను ఆశ్చర్యపరిచింది. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, డీఎల్‌పీవో రమణయ్య, ఎంపీడీవో జలజాక్షి, ఈవోఆర్‌డి నారాయణ, కార్యదర్శి గరుడయ్య, వీఆర్‌వోలు నాగార్జునరెడ్డి, శ్రీనువాసులు పాల్గొన్నారు.

జాతీయ ఆర్చరీకి హంసిని



విద్యార్థినిని అభినందిస్తున్న జీఎం రామ్మూర్తి నాయుడు

నెల్లూరు(విద్య), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గుజరాత్‌లో ఈనెల 19 నుంచి జరిగే జాతీయ ఆర్చరీ పోటీలకు నగరంలోని డాక్టర్ కిషోర్స్ రోషిణీ రత్నం మెడికల్ ఒలంపియాడ్ పాఠశాల విద్యార్థిని పీ లక్ష్మీ భావజ్ఞ హంసిని ఎంపికైనట్లు ఆ విద్యాసంస్థ జీఎం రామ్మూర్తి నాయుడు తెలిపారు. పాఠశా లలో గురువారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ పాఠశాల విద్యార్థిని హంసిని ఇటీవల విశాఖలో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతగా నిలిచి జాతీయ పోటీలకు ఎంపికైందని చెప్పా రు. జాతీయ పోటీల్లోనూ పతకం సాధించాలని ఆకాంక్షించారు. రత్నం విద్యా సంస్థల డైరెక్టర్లు డాక్టర్ కే కృష్ణకిషోర్, వాసంతి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాల్ మణిమాల, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

'నారాయణ'లో ప్రత్యేక మధుమేహ పరీక్షలు

నెల్లూరు (వైద్యం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నారాయణ ఆసుపత్రిలో మధుమేహ దినోత్సవం సంద్భంగా ప్రత్యేక మధుమేహ పరీక్షలు అందుబాటులోకి తీసుకువచ్చామని ఆసుపత్రి మెడకల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి వెల్లడించారు. గురువారం ఆసుపత్రిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైద్యులు సూచించిన వారికి డాప్లర్, డెక్సా స్కాన్ పరీక్షలు 50 శాతం రాయితీతో చేస్తున్నామన్నారు. ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఈ రాయితీ చికిత్సలు అందుబాటులో ఉంటాయని చెప్పా రు. ఎండోక్రైనాలజీ వైద్యులు డాక్టర్ సునంద, డాక్టర్ నిఖిత్ మాట్లాడుతూ కొవిడ్ కారణంగా మధుమేహ బాధితులు ఎక్కువయ్యారన్నారు. 30 ఏళ్లు పైబడిన వారు తప్పనిసరిగా మధుమేహ పరీక్షలు చేసుకోవాలని సూచించా రు. వ్యాయామం, ఆహార నియమాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దొరసానమ్మ, డాక్టర్ మేరగ రాజేష్‌కుమార్, కంటి వైద్య నిపుణులు డాక్టర్ సుధ, జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ మహిధర్‌రెడ్డి, డాక్టర్ మహేష్ పాల్గొన్నారు. రాయితీ పోస్టర్లను విడుదల చేశారు.

పాఠశాలల ఆధునికీకరణ పేరుతో అక్రమాలు : చేజర్ల

నెల్లూరు (వైద్యం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ పేరుతో వైసీపీ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి విమర్శించారు. గురువారం టీడీపీ జిల్లా కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాత భవనాలకే రంగులు వేసి కొత్తగా బిల్లులు కట్టుకున్నారని ఆరోపించారు. సెంట్రల్ ప్రొక్యూర్మెంట్ పేరుతో నాసిరకం మెటీరియల్‌ను ఎక్కువ ధరలకు కొనుగోలు చేశారని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం రూ. 2560 కోట్లు గ్రాంట్ ఇచ్చిందని ఇందులో రూ.1805 కోట్లు దుర్వినియోగం జరిగినట్లు కేంద్రం తేల్చిందన్నారు. పనులు చేసిన వారికి, మెటీరియల్ సరఫరా చేసిన వారికి రూ. 2400 కోట్లు ఇంకా బకాయిలు ఉన్నాయన్నారు. చాలా పాఠశాలల్లో నాడు నేడు కింద చేపట్టిన పనులు అసంపూర్తిగా మిగిలి పోయాయన్నారు. అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఉన్నత లక్ష్యం దిశగా కృషి చేయాలి : సీఈవో

ముత్తుకూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుపై దృష్టి సారిస్తే ఉన్నత స్థానాల్లో స్థిర పడతారని అదానీ కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జగదీష్ పటేల్ తెలిపారు. ముత్తుకూరు అదానీ విద్యా మందిర్‌లో గురువారం జరిగిన బాలల దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్య, కమ్యూనిటీ హెల్త్, సస్టైనబుల్ లైవ్లీహుడ్, డెవలప్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డెవలప్‌మెంట్ అనే నాలుగు ప్రధానరంగాలలో స్థానిక కమ్యూనిటీకి సాధికారత కల్పించేందుకు అదానీ గ్రూప్ కట్టుబడి ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు సీఎం సర్టిఫికెట్లు, మెడల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అదానీ విద్యామందిర్ ప్రిన్సిపాల్ జె.శ్రీనివాసరావు, ఏకేపీఎల్ కార్పొరేట్ అఫైర్స్ హెడ్‌కెఎం రామ్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధి ప్రశాంతిరెడ్డితోనే సాధ్యం

కొడవలూరు, నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యల్లయపాళెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఏకోల్లు వంశీధర్‌రెడ్డి తాడేపల్లి నివాసంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వంశీధర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితోనే సాధ్యమన్నారు. అలాగే సభ్యత్వ నమోదులో సహకరించిన టీడీపీ నాయకులు రియాజ్, కోటా జయరామిరెడ్డి, తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

మడమనూరు, జట్లకొండూరులో 'పొలం పిలుస్తోంది'

మనుబోలు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వరి నారుమడులలో వర్షపునీరు చేరిందని, వాటిని అందులోంచి తోడేయాలని మండల వ్యవసాయాధికారి జహీర్ తెలిపారు. మడమనూరు, జట్లకొండూరు పంచాయతీల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

జీవనశైలి మార్చుకోవాలి

నెల్లూరు (వైద్యం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మధుమేహ వ్యాధి నివారణకు ప్రధానంగా జీవనశైలిని మార్చుకోవాలని రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల వైద్య నిపుణుడు డాక్టర్ దత్తాత్రేయ వెల్లడించారు. గురువారం సాయంత్రం నగరంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. డాక్టర్ దత్తాత్రేయ మాట్లాడుతూ రక్తంలో ఇన్సులిన్ హార్మోన్‌ను నియంత్రిస్తే వ్యాధిని అదుపులో ఉంచుకోవచ్చని తెలియచేశారు. జీవన విధానంలో మార్పులు చేసుకుంటే వ్యాధిని నియంత్రించుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు ఉదయభాస్కర్, డాక్టర్ కాలేషా సాహెబ్, డాక్టర్ శ్యామ్‌కుమార్, డాక్టర్ రఫీ, డాక్టర్ భాషా, నగేష్, కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

వెంకటాచలం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కసుమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని గిరిజన కాలనీలో గురువారం బాల్య వివాహాలు, చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి (డీఐవో) డాక్టర్ ఉమామహేశ్వరి, కసుమూరు వైద్యాధికారిని ప్రవళిక పాల్గొన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రామసుబ్బారెడ్డి, ఎంపీహెచ్‌ఎస్ వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్, విద్యా, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

కోవూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణంలో జరిగిన రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన పాటూరు జడ్పీ పాఠశాల విద్యార్థులు పత్రి వెంకటమాధవి, జ్యోతి వరప్రసాద్‌లను గురువారం బాలల దినోత్సవం సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు, పీఈటీ వెంకటరమణయ్య, ఉపాధ్యాయులు జనార్దన్‌రెడ్డి, రవి శంకర్, టీ శేషయ్య, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.



అవెన్యూస్‌లో బాలల దినోత్సవం



వాత్సల్య అనాథాశ్రమంలో ప్రసంగిస్తున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి వాణి

బాలలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

● సీనియర్ సివిల్ న్యాయాధికారి వాణి ● ఘనంగా జాతీయ బాలల దినోత్సవం ● జవహర్‌లాల్ నెహ్రూకు నివాళి

నెల్లూరు(విద్య), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నేటి బాలలు రేపటి ఉత్తమ పౌరులుగా ఎదిగేలా వారిని తీర్చిదిద్దాలని జిల్లా న్యాయ సేవాదికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే వాణి పిలుపునిచ్చారు. దేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి, జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా గురువారం నగరంలోని వాత్సల్య అనాథాశ్రమంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె ప్రసంగించారు. పిల్లలను సక్రమమైన మార్గంలో నడిపించాలన్నారు. బాలల దినోత్సవం ఒక వేడుక మాత్రమే కాదని, బాలల హక్కులు, సంక్షేమం, భవిష్యత్ భద్రత గురించి నిర్ణయం తీసుకునేందుకు కేటాయించిందని తెలిపారు. అనంతరం కొండాయపాళెం నగర పాలక ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవంలో జడ్జి పాల్గొన్నారు. వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అంద చేశారు. ఈకార్యక్రమంలో వాత్సల్య ఆశ్రమ కార్యదర్శి సాంబశివరావు, డీఎస్పీచెంచురామయ్య, దిశ సీఐ కృష్ణారెడ్డి, డీసీపీవో సురేష్, డీసీఎల్‌ఎం వెంకటేశ్వరరావు, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, హెచ్‌ఎం ఎం భాస్కర్‌రావు పాల్గొన్నారు.

● అవెన్యూస్‌లో....

నగరంలోని బ్రహ్మానందపురంలో ఉన్న అవెన్యూస్ సీనియర్ సెకండరీ పాఠశాలలో గురువారం బాలల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బాల, బాలికలకు వివిధ రకాల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో నెల్‌కాస్ట్ డైరెక్టర్ పొన్నవోలు దీప్తి, పాఠశాల చైర్మన్ బాబు నాయుడు, కరస్పాండెంట్ కృష్ణచైతన్య, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్వేతా సంధ్య, వైస్ ప్రిన్సిపాల్ పీ సురేష్‌కుమార్, ప్రీ స్కూల్ ఇన్‌చార్జి షెహనాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

● రెడ్‌క్రాస్ దివ్యాంగుల కేంద్రంలో....

నెల్లూరు (వైద్యం): రెడ్‌క్రాస్ దివ్యాంగుల కేంద్రంలో నిర్వాహకులు నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మేనేజింగ్ కమిటీ సభ్యుడు, సలహాదారు దాసరి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ నెహ్రూకు పిల్లలంటే ఎంతో అభిమానమన్నారు. ఈసందర్భంగా దివ్యాంగులకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు, పండ్లు పంచి పెట్టాను. తలసీమియా విభాగం కోకన్వీనర్ పర్వీన్, అరుణ కుమారి, ఫిజియోథెరపిస్ట్ నవీన్, కో కన్వీనర్ బలరామయ్యనాయుడు పాల్గొన్నారు.

● అంగన్‌వాడీ కేంద్రాల్లో...

నెల్లూరు(హరనాథపురం) : నగరంలోని పలు అంగన్ వాడీ కేంద్రాల్లో బాలల దినోత్సవం నిర్వహించారు. గాంధీనగర్ సెక్టార్‌లోని రాంనగర్, క్రాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో నెహ్రూపై పద్యాలను చిన్నారులు చెప్పారు. ఐసీ డీఎస్ పీడీ హేనాసుజన్, అర్బన్ సీడీపీవో లక్ష్మీదేవి, సెక్టార్ సూపర్‌వైజర్ సుకన్య తది తరులు పాల్గొన్నారు.

● కోవూరు : మండల పరిధిలోని గ్రామాల్లో బాలల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో లీగల్ సర్వీసెస్ అథారిటీ నిర్వ హించిన కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయా దికారి చైతన్య మాట్లాడుతూ బాలల విద్యాహక్కును కాపాడాలన్నారు. ఈకార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యుడు వీ రాంబాబు, ప్రధానోపాధ్యాయిని జాన్సీ మాట్లాడారు. విద్యా హక్కు చట్టం అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించి గెలుపొందిన బాలలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచు యాకసిరి విజయమ్మ, ప్రధానోపాధ్యాయిని పద్మరేఖ, లైబ్రేరియన్ సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.



బుచ్చి శాఖా గ్రంథాలయంలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ అధికారి, విద్యార్థులు

● కొడవలూరు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు లైబ్రేరియన్ కె రాజేశ్వరి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా బాలల దినోత్సవం సందర్భంగా పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వెంకయ్య, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఆదినారాయణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

●ఇందుకూరుపేట : గంగపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ముందుగా చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పెనుబల్లి రామకృష్ణయ్య నాయుడు, రమణమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు అవెన్యూ స్కూల్ కరస్పాం డెంట్ పెనబల్లి కృష్ణ చైతన్య బహుమతులు అందజేశారు. అదేవిధంగా నరసాపురం ఎంపీఆర్ జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి నాగేశ్వరరావు, పర్వీన్, వ్యాయామ ఉపాధ్యాయులు ముజీర్, విద్యా కమిటీ చైర్మన్ కంసాని గోపి, దండిగుంట వంశీ, కంసాని మల్లికార్జునరెడ్డి, వేనాటి వినయ్ పాల్గొన్నారు.

●విడవలూరు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు స్థానిక గ్రంథాలయం, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో గురువారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఐ నరేష్‌కుమార్ యా దవ్, ప్రిన్సిపాల్ మధు గ్రంథాలయ ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ నిరూప పాల్గొన్నారు.

● బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి మంజులత, జిల్లా రిసోర్సు సభ్యులు గండికోట సుధీర్‌కుమార్, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

● వెంకటాచలం: ఇస్కపాళెం, చెముడు గుంట ప్రభుత్వ పాఠశాలలో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇస్క పాళెంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్‌బాబు, నిడిగుంటపాళెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చలపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు పాఠశాలకు గ్రంథాలయ పుస్తకాలను బహూకరించారు. అనంతరం పిల్లలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీఆర్‌పీ మల్లికార్జున్, ప్రధానోపాధ్యాయుడు పార్వతీశం, ఉపాధ్యాయులు మాధవ్, కవిత, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, టీడీపీ నేతశ్రీనితరెడ్డి ఉన్నారు.

● తోటపల్లిగూడూరు: సౌత్ ఆములూరు ప్రాథమికోన్నత పాఠశాల, జిల్లా ప్రాథమిక ఉన్నత పాఠశాల, చెన్నపల్లిపాలెంలో జవహర్ లాల్ నెహ్రూ జయంతిని నిర్వహించారు. కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు, సాయిప్రసాద్, షేక్.అహ్మద్‌బాషా, ఉపాధ్యాయులు ఫణికుమార్, పీడీ నాగరాజు, కె.వసంతలక్ష్మీ, కె.హెప్సీ విద్యుల్లత, బి.కృష్ణవేణి, విద్యార్థులు పాల్గొన్నారు.

● పొదలకూరు: పొదలకూరు నాగార్జున, అమరావతి, విజేత పాఠశాలలో నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సునీతారెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్.లక్ష్మీదుర్గ, అన్నం సుబ్బారావు, అకడమిక్ డీన్ కృష్ణ, డైరెక్టర్స్ జీఎస్.రెడ్డి, చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ పాపయ్య, ఏఓ జీవీఆర్ యాదవ్, పాల్గొన్నారు.

● చిన్నారులకు స్టేషనరీ పంపిణీ

పొదలకూరు పంచాయతీలోని లింగంపల్లి, లింగంపల్లితోపు, లింగంపల్లి ఎస్టీ కాలనీ, ఏసీ కాలనీ, రామ్‌నగర్‌గేట్ సెంటర్, శివాలయ వీధిలోని ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో టీడీపీ తెలుగు యువత నాయకులు డేగా యశ్వంత్‌రెడ్డి, ఆదాల మురళీరెడ్డి, అనీల్‌కుమార్‌రెడ్డిలు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు డ్రాయింగ్ ప్యాడ్ కిట్లు, అవసరమైన స్టేషనరీ, చాక్లెట్ ప్యాకెట్ అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యురాలు మస్తానమ్మ, టీడీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొంగి రమణయ్య, ఎస్‌కె.బాబు పాల్గొన్నారు.

● రాపూరు : మండలంలోని గోనుపల్లి జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో చాచా నెహ్రూ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఆచార్య నాగేంద్రకుమార్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కెసి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు గ్రంథాలయ సహాయకుడు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



కోవూరులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి చైతన్య



విడవలూరు గ్రంథాలయంలో మాట్లాడుతున్న ఎస్ఐ నరేష్‌కుమార్

హామీల అమలులో ప్రభుత్వం విఫలం: సీపీఎం

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 14:(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుపరచడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఎం బుచ్చిరెడ్డిళెం ప్రాంతీయ కమిటీ కార్యదర్శి గండవరపు శ్రీనివాసులు అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా గురువారం తహసీల్దారు కార్యాలయం ముందు సీపీఎం నాయకులతో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబునాయుడు విద్యుత్ చార్జీలు పెంచబోమని, గత ప్రభుత్వం పెంచిన ట్రూఅప్ చార్జీలు రద్దు చేస్తామని చెప్పారన్నారు. ఇచ్చిన పలు హామీలు ఇంతవరకు అమలు కాలేదన్నారు. కోవూరు షుగర్ ఫ్యాక్టరీని వినియోగంలోకి తెస్తే 5వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీనివాసులు, మల్లికార్జున, అంకయ్య, మునుస్వామి, సురేష్, మల్లికార్జున, రఘురామయ్య, మునీర్,జానీభాష, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

● కోవూరు: విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ సీపీఎం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఆందోళనలో భాగంగా గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ధర్నా చేశారు. మందబయలు కూడలిలోని సీపీఎం కార్యాలయం నుంచి ప్రదర్శన చేపట్టారు. పార్టీ జిల్లా కమిటీ కార్యదర్శివర్గ సభ్యుడు జొన్నలగడ్డ వెంకమరాజు మాట్లాడుతూ విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించాలన్నారు. ఈ ఆందోళనలో సీపీఎం నాయకులు గండవరపు శేషయ్య, బుజ్జయ్య, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు. తహసీల్దారు నిర్మలానందబాబాకు వినతిపత్రం సమర్పించారు.

● మనుబోలు: పెరిగిన నిత్యావసర ధరలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగ్గించాలంటూ సీపీఎం నాయకులు గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెంచిన విద్యుత్తు ట్రూఅప్ చార్జీలను ప్రభుత్వమే భరించాలని 18 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఉపతహసీల్దార్ బషీర్‌కు ఇచ్చారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలన్నారు. కృష్ణపట్నం పోర్టులో టెర్మినల్ పనులు పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు కటికాల వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి తలారి దేవదానం, సుబ్రమణ్యం, రామయ్య, కొట్టు వెంకటేశ్వర్లు, మాసు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● ముత్తుకూరు : సీపీఎం పార్టీ మండల నాయకులు తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి రీ సర్వే డీటీ శ్రీనివాసులుకు వినతిప్రత్రం అందజేశారు. ధర్నాను ఉద్దేశించి పార్టీ మండల కార్యదర్శి గడ్డం అంకయ్య మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రజాపోరు చేపట్టామన్నారు. కాలుష్య కోరల్లో చిక్కుకున్న ముత్తుకూరు మండల ప్రజానీకానికి సీఎస్ఆర్ నిధుల నుంచి ప్రతి కుటుంబానికి నెలకు రూ.25కేజీల బియ్యం, రూ.3వేల నగదును పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నక్క రాధయ్య, షేక్ మస్తాన్‌షా, దుంపలు ఏడుకొండలు, నక్క శ్యాంప్రసాద్, బ్రహ్మదేవి మోహన్‌రావు, ఆటో స్టాండ్ ప్రెసిడెంట్ విజయ్ పాల్గొన్నారు.

●వెంకటాచలం: స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట గురువారం సీపీఎం నేతలు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా తహసీల్దారు శ్రీనివాసులుకు పలు డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి తలారి దేవదానం మాట్లాడారు. ఉచిత ఇసుకను వెంటనే అమలు చేయాలని, కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్‌ను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ట్రూలప్ చార్జీలు ప్రభుత్వం భరించాలన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలన్నారు. డీఎస్సీ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, రామయ్య, ఆదిశేషయ్య పాల్గొన్నారు.



బుచ్చిలో నిరసన చేస్తున్న సీపీఎం నాయకులు



కోవూరులో ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

డిజిటల్ క్రైమ్‌పై అవగాహన అవసరం

● గుంజి వేణు
నెల్లూరు రూరల్ సీఐ



నెల్లూరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్లను లక్ష్యంగా చేసుకుని కొందరు నేరగాళ్లు వీడియోకాల్స్ ద్వారా బెదిరించి డిజిటల్ క్రైంకు పాల్పడుతున్నారు. దీనిపై అవగాహన అవసరం. పోలీసులు ఎవరూ వీడియోకాల్ చేసి అరెస్ట్ చేస్తామని చెప్పరు. అలా చెబితే సమీప పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయండని నెల్లూరు రూరల్ సీఐ గుంజి వేణు తెలిపారు. ఆయన మాటల్లో మరిన్ని విషయాలు...

ఇంటర్వ్యూ

? సైబర్ క్రైంకు కళ్లెం వేయలేమా.

! దీనిని అరికట్టాలంటే ముందుగా ప్రజల్లో అవగాహన పెరగాలి. నేరగాళ్ల మాయకు కొందరు బలవుతున్నారు. అవకాశం ఉన్న సందర్భాల్లో అవగాహన కల్పిస్తూనే ఉన్నాము.

? వీడియో కాల్స్ అరెస్టేంటి.

! ఇలాంటివి ఈమధ్య కాలంలో వెలుగులోకి వస్తున్నాయి. కొందరు నేరగాళ్లు పోలీసు వేషాల్లో స్టేషన్లు సెట్ చేసుకుని సీనియర్ సిటిజన్లే లక్ష్యంగా ఈ తరహా నేరాలకు పాల్పడుతున్నారు. ఇలాంటివి జరిగినప్పుడు మాకు తెలియచేయండి.

? రూరల్లో రాత్రుళ్లు గస్తీ కనిపించడం లేదన్న విమర్శ ఉంది.

! ప్రతీరోజు రాత్రుళ్లు నాలుగు బీట్ల చొప్పున గస్తీ నిర్వహిస్తున్నాము. పగలు ఒక బీటు గస్తీ నడుస్తుంది. క్రైం కార్నర్ ఉన్నచోట ఈ గస్తీలు పనిచేస్తుంటాయి. ప్రతీరోజు ఆయా ప్రాంతాల వారీగా గస్తీలను ఏర్పాటు చేస్తున్నాము. ఎక్కడా లోపం లేదు.

? చోరీలు ఎక్కువవుతున్నాయి. నియంత్రణ ఎలా.

! చోరీలను అదుపు చేసేందుకు శక్తికి మించి పనిచేస్తున్నాము. గ్రామాలు, మున్సిపల్ ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు ఎవరు కనిపించినా పోలీసు స్టేషన్లకు సమాచారం ఇవ్వమని ప్రజలను కోరుతున్నాము. ఇళ్లు ఖాళీగా పెట్టినా మాకు చెప్పమంటున్నాము. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

న్యూస్ బాక్స్

రాష్ట్రానికి చంద్రబాబు ఒక వరం

● అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక వరమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. గురువారం అసెంబ్లీలో బడ్జెట్‌పై ఆమె సుదీర్ఘ ప్రసంగం చేశారు. 2024-25 రాష్ట్ర బడ్జెట్ సమపాళ్లలో ఉందన్నారు. ఆర్థిక సంక్షోభంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఈ బడ్జెట్ కొత్త ఊపిరి పోసిందన్నారు. గత ప్రభుత్వం అనర్హులకు పింఛన్లు అందించిందని, కూటమి ప్రభుత్వం అర్హులను గుర్తించి పింఛన్లు ఇవ్వాలని కోరారు. కోవూరు నియోజకవర్గంలో కొందరు అనర్హులు పింఛన్లు పొందుతున్నారన్నారు. ఇందుకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమాధానమిస్తూ అర్హులైన ప్రతీ ఒక్కరికి పింఛన్లు అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం


రాష్ట్ర బడ్జెట్‌లో గిరిజనుల కోసం రూ.7557 కోట్లను చంద్రబాబు నాయుడు కేటాయించటం హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ ఎరుకల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లగొండ శివ అన్నారు. గురువారం కొండాపాళెంలో ఉన్న ఎరుకల భవన్‌లో చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేశారు. అసెంబ్లీలో గిరిజనుల సంక్షేమం కోసం గళం విప్పినందుకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నల్లగొండ్ల వెంకయ్య నాయకులు నల్లబోతు వీరయ్య, నల్లగొండ్ల పోలయ్య, కట్టా నాగేష్, దేవరకొండ చిన్నోడయ్య, రౌతు అశోక్ పాల్గొన్నారు.

బీదతో కోటంరెడ్డి భేటీ




కోటంరెడ్డిని సత్కరిస్తున్న బీద రవిచంద్ర

నెల్లూరు (వైద్యం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రను పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. బీద నివాసానికి వెళ్లి శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. రవిచంద్ర కూడా కోటంరెడ్డికి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.



తుడా ఎవరికి?



● టీడీపీ, జనసేన ఆశావహుల పోటీతో ప్రతిష్ఠంభన

తుడా చైర్మన్ పదవి ఎవరికి దక్కుతుందనేది జిల్లావ్యాప్తంగా చర్చకు దారితీస్తోంది. ఇప్పటికే రాష్ట్రస్థాయిలో ముఖ్యమైన నామినేటెడ్ పదవులు చాలావరకూ భర్తీ అయిన సంగతి తెలిసిందే. తుడా చైర్మన్ పదవిని అటు టీడీపీ, ఇటు జనసేన పార్టీల నుంచీ పలువురు ఆశించి పోటీ పడుతుండడంతో ప్రతిష్టంభన నెలకొంది. టీటీడీ ఎక్స్ అఫిషియో సభ్యత్వం పేరిట అదనపు హోదా తోడవుతున్నందున పలువురి కన్ను తుడా చైర్మన్ పదవిపై పడుతోంది. ఇతర పదవులు దక్కని వారు కూడా దీనికోసం రేసులో నిలుస్తున్నారు. ఆలస్యమయ్యే కొద్దీ ఈ పదవికి పోటీ మరింత పెరుగుతోంది. ఈ నేపథ్యంలో టీడీపీ అధినేత నిర్ణయం కోసం అంతా ఎదురు చూస్తున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

జనసేన నుంచి తీవ్ర పోటీ

జనసేన పార్టీ నుంచీ జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, తిరుపతి ఇన్‌ఛార్జి కిరణ్ రాయల్ ఇద్దరూ తుడా చైర్మన్ పదవి ఆశించారు. అయితే హఠాత్తుగా నిర్మాత ఎన్వీ ప్రసాద్ పేరు తెరపైకి వచ్చింది. ఆయన కోసం మెగాస్టార్ చిరంజీవి గట్టిగా పట్టుబడుతున్నారనే ప్రచారం సాగుతోంది. మరోవైపు చిత్తూరు మాజీ ఎంపీ దివంగత డీకే ఆదికేశవులు నాయుడు మనవరాలు చైతన్య పేరు కూడా ప్రచారంలో ఉంది. ఇప్పటికే ఆమె పవన్ కల్యాణ్, చంద్రబాబు, లోకేశ్‌లు ముగ్గురినీ కలసి తనకు అవకాశం కల్పించాలని కోరినట్లు ఇరు పార్టీల వర్గాలూ చెబుతున్నాయి. అయితే చైతన్యకు కాకుండా ఆమె తల్లికి ఏదో ఒక పదవి కేటాయిస్తామంటూ అధినేతలు నచ్చజెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. శ్రీకాళహస్తికి చెందిన ఓ టీడీపీ ముఖ్యనేత ఆమెకు తుడా చైర్మన్ పదవి ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

టీడీపీ రేసులో పలువురు

తిరుపతి ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలు రెండూ కూటమి భాగస్వామ్య పక్షాలకు కేటాయించిన కారణంగా తిరుపతిలో పార్టీ పటిష్ఠంగా ఉండాలంటే తుడా చైర్మన్ పదవి టీడీపీ ఖాతాలోనే ఉండాలని ఆ పార్టీ స్థానిక నాయకులు ఆశిస్తున్నారు. తొలినుంచీ ఈ పదవికి జిల్లా టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రమణ్యం, మబ్బు దేవనారాయణరెడ్డి, డాలర్స్ దివాకర్‌రెడ్డి, శ్రీకాళహస్తికి చెందిన ఓ కాంట్రాక్టర్ పేర్లు ప్రచారంలో ఉన్నాయి. అయితే నరసింహ యాదవ్‌కు యాదవ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చినప్పటికీ ఆయన ఆ పదవి పట్ల సంతృప్తిగా లేరని సమాచారం. తనకు తుడా చైర్మన్‌గా అవకాశం కల్పించాలని కోరినట్లు పార్టీ వర్గాల సమాచారం. దీంతో ఆయన మళ్లీ రేసులోకి వచ్చినట్టయింది. టీటీడీ బోర్డు మెంబరు పదవి ఆశించి నిరాశకు గురైన పార్టీ మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ పేరు కూడా పార్టీ పరిశీలిస్తున్న జాబితాలో చేరింది. ప్రస్తుత దశలో వీరందరితో పాటు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆయన సతీమణి సుధారెడ్డిల పేర్లు కూడా అధిష్ఠానం పరిశీలనలో ఉన్నట్టు ఆ వర్గాలు చెబుతున్నాయి.

టీడీపీ అధినేత నిర్ణయంపై ఉత్కంఠ

ఇంతకీ తుడా పదవి టీడీపీ వారికా, జనసేనకా అనే చర్చ జోరుగా సాగుతోంది. జనసేనాని పవన్ కళ్యాణ్ తమ పార్టీకి కావాలని గట్టిగా పట్టుబట్టని పక్షంలో టీడీపీ వారికే దక్కుతుందని ఆ వర్గాలు చెబుతున్నాయి. అధినేత నుంచీ సూచనప్రాయంగా కూడా ఎలాంటి సంకేతాలూ అందకపోవడంతో దీనిపై ప్రత్యేకించి తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల టీడీపీ, జనసేన వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంటోంది. అధినేత నిర్ణయం ఎలా ఉన్నా ఇక్కడి నేతలు శిరసావహించే పరిస్థితి ఉంది. అయితే ఆ నిర్ణయమే తిరుపతిలో టీడీపీ భవిష్యత్తును నిర్ణయించనుంది. అందుకే చంద్రబాబు తీసుకునే నిర్ణయం కోసం రాజకీయ వర్గాలతో పాటు ఈ ప్రాంత ప్రజానీకం సైతం ఆసక్తిగా ఎదురుచూస్తోంది.



అప్పుడేం జరిగింది?

● తిరుపతి కార్పొరేషన్లో గత అధికారులపై విచారణ

● ఆర్డీ నేతృత్వంలో లోతుగా ఆరా తీస్తున్న బృందాలు

తిరుపతి నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్లో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పూర్వ అధికారులపై విచారణ వేగవంతమైంది. మంత్రి లోకేష్‌కు అందిన ఫిర్యాదుల నేపథ్యంలో డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆదేశాలతో గురువారం కార్పొరేషన్ కార్యాలయానికి విచారణ బృందం వచ్చింది. అనంతపురం రీజనల్ డైరెక్టర్ విశ్వనాథ్ నేతృత్వంలో ప్రొద్దుటూరు, కళ్యాణదుర్గం, పుత్తూరు మున్సిపల్ కమిషనర్లతో పాటు ఓ రెవెన్యూ అధికారి, ఇద్దరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల బృందం విచారణ మొదలుపెట్టింది. గతంలో ఇక్కడ రెవెన్యూ అధికారిగా పనిచేసిన కేఎల్‌వర్మకు సంబంధించిన వ్యవహారాలపై ఆరా తీశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా ఇంటి పన్నులు పెంచిన, తగ్గించిన అభియోగాలపై రికార్డులను పరిశీలించారు. ఆయన దగ్గర పనిచేసిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు మధుసూదన రెడ్డి,భాస్కర రెడ్డి,సూరిబాబు,ప్రకాష్, నవీన్‌లను విచారించారు. శుక్రవారం క్షేత్రస్థాయిలోనూ పరిశీలించి ఇంటి పన్నుల వ్యత్యాసాలపై తనిఖీ చేయనున్నారు.మున్సిపల్ గత మేనేజర్ చిట్టిబాబుపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి కూడా విచారణ జరుగుతున్నట్లు సమాచారం. కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈవెంట్లకు సంబంధించి ఆర్గనైజర్‌కు అడ్డగోలుగా బిల్లులు చెల్లించారనే ఆరోపణపై ఆరా తీశారు.కార్పొరేషన్ అకౌంటెం ట్‌ను పిలిచి ఓచర్లను పరిశీలించారు.వారం రోజుల్లో ప్రభుత్వా నికి నివేదిక అందజేయనున్నట్టు తెలిసింది.



విద్యార్థులను పరామర్శిస్తున్న కలెక్టర్

సత్యవేడు గురుకులంలో జ్వరాల కలకలం

● 60 మంది బాధితులు ఆస్పత్రికి తరలింపు ● విద్యార్థులను పరామర్శించిన కలెక్టర్

సత్యవేడు, నవంబరు 14: సత్యవేడులోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో 60 మందికి పైగా విద్యార్థులు జ్వరాల బారిన పడడం కలకలం రేపింది. గురువారం ఉదయం మెస్‌కు అల్పాహారానికి వెళుతున్న సమయంలో ఇద్దరు కళ్లు తిరిగి పడిపోయారు. తోటి విద్యార్థులు గుర్తించి వెంటనే ఉపాధ్యాయులకు తెలియజేశారు. పాఠశాల స్టాఫ్‌నర్స్ భువనేశ్వరి విద్యార్థులను పరీక్షించగా జ్వరం తీవ్రంగా ఉందని నిర్ధారించారు. మరో 15 మంది కూడా జ్వరంతో బాధపడుతున్నారని గుర్తించి వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి అందర్నీ తరలించారు. డాక్టర్ సురేష్ ఆధ్వర్యంలో వైద్య బృందం చికిత్స అందించారు. 60 మందికి పైగా జ్వర బాధితులను గుర్తించారు. ఆరవ తరగతి విద్యార్థి శివశంకర్‌కు జ్వరం తీవ్రంగా ఉండడంతో తిరుపతి రుయా ఆస్పత్రికి రెఫర్ చేశారు. తహసీల్దార్ సుబ్రమణ్యం, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవో రవి ఆస్పత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మరోవైపు దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గుణశేఖర్ ఆధ్వర్యంలో పాఠశాలలో మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి పాఠశాలను సందర్శించి వివరాలను ఆరా తీశారు. రుయాలో చికిత్స పొందుతున్న శివశంకర్ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సాధారణ వైరల్ ఫీవర్ మాత్రమేనని ధ్రువీకరించారు. కలెక్టర్ వెంకటేశ్వర్ ఆస్పత్రికి చేరుకుని విద్యార్థులను పరామర్శించారు. డీఎంహెచ్ఓ శ్రీహరి, డీసీహెచ్ఓ ఆనందమూర్తి, ఆర్డీవో కిరణ్మయితో కలిసి ఆస్పత్రిని సందర్శించి, విద్యార్థులకు అందిస్తున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, స్టాఫ్‌నర్స్ భువనేశ్వరిలతో సమీక్షించారు. విద్యార్థుల



చికిత్స పొందుతున్న విద్యార్థులు

ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించడం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు కోలుకునే వరకు పాఠశాలలో వైద్య బృందం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదిమూలం ఈ ఘటనపై ఆస్పత్రి డాక్టర్లు, పాఠశాల యాజమాన్యంతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జ్వర బాధిత విద్యార్థులకు మలేరియా, టైఫాయిడ్, డెంగీ, జాండీస్ తదితర రక్త పరీక్షలు నిర్వహించారు. అందరికీ నెగటివ్ రిపోర్టులు వచ్చాయని, తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డాక్టర్ గుణశేఖర్ తెలిపారు. పాఠశాలలో నీటి శాంపిల్స్ తిరుపతి పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌కు పంపించినట్లు వివరించారు. పాఠశాలలో మూడు రోజుల నుంచి పలువురు విద్యార్థులు జ్వరాలతో బాధపడుతున్నట్లు తెలిసింది.

విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించండి

● కలెక్టర్‌కు మంత్రి సవిత ఆదేశం

సత్యవేడు, నవంబరు 14: సత్యవేడు బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థుల అస్వస్థతపై రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యుఎస్, సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆరా తీశారు. వైరల్ ఫీవర్ వల్లే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని తెలుసుకున్న మంత్రి మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ వెంకటేశ్వర్, డీఎంఅండ్‌హెచ్‌వో శ్రీధర్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల అస్వస్థతకు గురయ్యారని అధికారులు వివరించారు. వైరల్ ఫీవర్ సోకినట్లు గుర్తించామన్నారు.

డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య





తిరుపతి(నేరవిభాగం), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీపద్మావతీ మహిళా డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి కృష్ణమూర్తి ఫిర్యాదు మేరకు ఎస్వీయూ సీఐ రామయ్య కేసు నమోదు చేశారు. అన్నమయ్య జిల్లా గుర్రంకొండకు చెందిన కృష్ణమూర్తి కూలి పనులు చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతని రెండవ కుమార్తె పి.అనిత తిరుపతిలోని శ్రీపద్మావతీ మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ బయోకెమిస్ట్రీలో చేర్పించాడు. ప్రస్తుతం ఈమె రెండవ సంవత్సరం చదువుతోంది. గురువారం అనిత క్లాసులకు హాజరుకాలేదు. మధ్యాహ్నం హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తోటి విద్యార్థులు అనుమానం వచ్చి వార్డెన్‌కు విషయం తెలియజేశారు. ఎస్వీయూ పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రామయ్య, ఏఎస్ఐ దాము, కానిస్టేబుల్ అక్కడకు వెళ్లి పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉండడంతో వెంటనే మృతురాలు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వారు హాస్టల్ వద్దకు చేరుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. జరిగిన ఘటనపై విద్యార్థులు హాస్టల్ వద్ద కాసేపు ఆందోళన నిర్వహించారు. మృతికి గల కారణాలపై ఆరా తీయాలని డిమాండ్ చేశారు. కాగా స్వగ్రామంలో అనిత స్నేహితుడొకరు రెండు రోజుల క్రితం మృతి చెందడంతో అప్పటి నుంచి ముభావంగా ఉన్నట్లు సమాచారం. ఆ బాధలోనే ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వ్యక్తిగత కారణాలతో విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నారాయణమ్మ తెలిపారు.

సప్తగిరులను కప్పేసిన పొగమంచు



తిరుమల శేషాచల కొండలను దట్టమైన పొగమంచు కప్పేసింది. నాలుగు రోజులుగా తిరుపతి, తిరుమలలో వర్షం కురుసున్న విషయం తెలిసిందే. వర్షం నిలిచిపోయిన సందర్భాల్లో పొగమంచు శేషాచల కొండలపై వాలిపోతోంది. స్వామి దర్శనం కోసం వచ్చే ప్రకృతి ప్రేమికులకు ఆ దృశ్యాలు ప్రత్యేక అనుభూతులను కలిగిస్తున్నాయి. ఘాట్ రోడ్లలో ప్రయాణించే వాహనదారులు తమ వాహనాలను ఆపి మరీ కనులారా తిలకిస్తున్నారు. మరోవైపు తిరుమలలోనూ పొగమంచు కనువిందు చేస్తోంది. తెల్లటి మంచులో స్వామి ఆలయం, పార్కులు, అతిథిగృహాలు ప్రత్యేక అందాలను సంతరించుకున్నారు. స్వామి దర్శనం తర్వాత భక్తులు పొగమంచులో ఆహ్లాదకరంగా గడుపుతున్నారు. ఇక, గురువారం కూడా పలు సందర్భాల్లో చిరుజల్లులు కురిశాయి.



సిపాయికి మండలి ప్యానల్ వైస్ చైర్మన్ పదవి



తిరుపతి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన రష్ ఆస్పత్రి అధినేత, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం శాసనమండలి ప్యానల్ వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు. మండలిలో బుధవారం ఈ నియామకం జరిగింది. ఎమ్మెల్సీగా నియామకమైన మొదటి ఏడాదిలోనే ఆయన ప్యానల్ వైస్ చైర్మన్‌గా నియమితులు కావడం పట్ల వైసీపీ వర్గీయులు, ఆయన అనుచరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గృహ ప్రవేశానికి వచ్చి మృత్యు ఒడికి..



నుజ్జు నుజ్జు అయిన కారు

రోడ్డు ప్రమాదంలో తల్లీకూతుళ్ల మృతి

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వారందరూ ఒకే కుటుంబ సభ్యులు. గృహ ప్రవేశానికి హాజరయ్యేందుకు వచ్చారు. మార్గం మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాద ఘటన పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలోని వేదాంతపురం వద్ద గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు కథనం మేరకు... తిరుపతి రూరల్ మండలం ధనలక్ష్మీనగర్ క్షత్రియ ఎన్‌క్లేవ్ అపార్టుమెంటులో కాపురముంటున్న బిల్డర్ రాజశేఖర రాజు వేదాంతపురం పంచాయతీ ఎంజీ బ్రదర్స్ లేఅవుట్‌లో నూతనంగా ఇల్లు నిర్మించాడు. గృహ ప్రవేశానికి అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం రంగంపల్లి నుంచి ఆయన తల్లి సావిత్రి(80), చెల్లెళ్ల సంగీత(38), జ్యోతి, లక్ష్మీదేవి వచ్చారు. టీఎన్ 12-4581 నెంబరు కారులో ధనలక్ష్మీనగర్ నుంచి గృహ ప్రవేశం జరుగుతున్న ఎంజీ బ్రదర్స్ లేఅవుట్‌కు బయలుదేరారు. వేదాంతపురం క్రాస్ వద్ద బైపాస్ దాటుతుండగా నల్గొండ నుంచి బెంగళూరుకు వెళుతున్న బాలాజీ ట్రావెల్స్ బస్సు వేగంగా ఢీకొంది. దాదాపు 50 అడుగుల వరకు లాక్కెళ్లడంతో కారు నుజ్జునుజ్జు అయింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న సావిత్రి, సంగీత తీవ్రంగా గాయపడ్డారు. జ్యోతి, లక్ష్మీదేవి స్వల్పంగా గాయపడ్డారు. వీరిని తిరుపతి రుయాకు తరలించారు. చికిత్స పొందుతూ సావిత్రి, సంగీత మృతి చెందారు. మిగిలిన ఇద్దరి పరిస్థితి కొంత మెరుగ్గా ఉందని పోలీసులు చెప్పారు. సంగీత తిరుపతి రూరల్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ రమేష్ భార్య. కాగా బస్సు డ్రైవర్ సురేష్‌ను అదుపులోకి తీసుకుని బస్సును సీజ్ చేసినట్లు పోలీసులు చెప్పారు. రాజశేఖర్ రాజు తమ్ముడు రాఘవరాజు ఫిర్యాదు మేరకు తిరుపతి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించినట్లు సీఐ చెప్పారు.



ప్రమాదంలో మృతి చెందిన సావిత్రి, సంగీత





ప్రయాణం.. నరక ప్రాయం

అసలే వర్షాలు.. పైగా మట్టి రోడ్డు.. బురదమయమైన ఈ రోడ్డులో ప్రయాణం సాగించేందుకు పెళ్లకూరు మండలంలోని యాలకారికండ్రిగ గ్రామస్తులు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. చింతపూడి గ్రామం నుంచి యాలకారికండ్రిగకు చేరుకునే రోడ్డు వర్షం కురిస్తే బురదమయంగా మారుతోంది. వాహనదారులే కాకుండా పాదచారులూ ఇబ్బంది పడుతున్నారు. పాఠశాలకు వెళ్లి వచ్చే క్రమంలో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, కనీసం గ్రావెల్, మెటల్ పరిచి కష్టాలు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

- పెళ్లకూరు, ఆంధ్రజ్యోతి

శ్రీసిటీలో నీతి అయోగ్ సీఈవో

శ్రీసిటీ, నవంబరు 14: నీతి అయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రమణ్యం గురువారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ చైర్మన్ శ్రీనిరాజు, ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రత్యేకతలు, పారిశ్రామిక వృద్ధి సామర్థ్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పరిశ్రమల సీఈవోల సమావేశంలో సుబ్రమణ్యం మాట్లాడుతూ భారతదేశం అన్ని విధాలా వేగంగా దూసుకుపోతున్న ప్రస్తుత తరుణంలో పరిశ్రమల వృద్ధి, స్థాపనకు అత్యంత అనువైనదంటూ పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. దేశంలో అత్యధిక జనాభా, యువత అందుబాటులో ఉందన్నారు. వారిని శ్రామికశక్తిగా మార్చుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఉద్యోగ కల్పన, ప్రాంతీయ అభివృద్ధి, స్థిరమైన ఆర్థికవృద్ధికి కీలకమైన శ్రీసిటీ తరహా పారిశ్రామిక కేంద్రాలకు అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు నీతి అయోగ్ కట్టుబడి ఉందని సుబ్రమణ్యం స్పష్టం చేశారు. పరస్పర చర్చల సందర్భంగా నైపుణ్యాభివృద్ధి, ప్రతిభకు ప్రోత్సాహం, పరిశ్రమలకు సమీపంలో కార్మికుల నివాస గృహ సౌకర్యాలకు సంబంధించిన సమస్యలను పరిశ్రమల ప్రతినిధులు లేవనెత్తారు. ఇందుకు సుబ్రమణ్యం సానుకూలంగా స్పందిస్తూ వీటిని కీలకంగా గుర్తిస్తూ విధాన నిర్ణయాల్లో ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చారు.



సుబ్రమణ్యానికి స్వాగతం పలుకుతున్న శ్రీసిటీ ఎండీ

విలువిద్యలో 'మణిరత్నం'

విలువిద్యలో ఆ యువకుడు పట్టువదలని విక్రమార్కుడు. మధ్య తరగతి నేపథ్యమైనా ఇటు విద్యలోనూ అటు క్రీడాకారుడిగా రాణిస్తూ ప్రతిభ చాటుకుంటున్నాడు తరుమూరు గణేష్ మణిరత్నం. ప్రపంచ స్థాయిలో పతకమే లక్ష్యంగా గురి తప్పకుండా కృషి చేస్తున్నాడీ విలువిద్య క్రీడాకారుడు.

- తిరుపతి(క్రీడలు)



విలువిద్యలో పోటీపడుతున్న గణేష్ మణిరత్నం



ఏషియన్ ఆర్చరీ యూత్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకాలతో..



నాయుడుపేటలోని భరత్‌నగర్‌కు చెందిన తరుమూరు హరిప్రసాద్ దంపతుల కుమారుడు గణేష్ మణిరత్నం. హరిప్రసాద్ సమీపంలోని టోల్‌ప్లాజాలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. తన కుమారుడి ఆసక్తి గమనించి చదువుతో పాటు క్రీడా రంగంలోనూ ప్రోత్సహించాలని భావించారు. స్నేహితుల సలహాతో విలువిద్య(ఆర్చరీ)ను నేర్పించాలని సంకల్పించారు. 2016లో ఐదవ తరగతి చదువుకుంటున్న మణిరత్నాన్ని విలువిద్య కోచ్ శివశంకర్ దగ్గర చేర్పించారు. తండ్రి ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకుని కొన్ని నెలలకే విశాఖపట్నంలోని సంస్కృతి గ్లోబల్‌స్కూల్‌లో శాప్ సెలక్షన్స్‌లో ఎంపికయ్యాడు. శాప్‌కోచ్ సుధాకర్‌నాయుడు దగ్గర రెండేళ్లపాటు శిక్షణ తీసుకున్నాడు. పదవ తరగతి పాస్ అయ్యాక భీమవరంలోని కోచ్ కమల కిషోర్ వద్ద శిక్షణ పొందాడు. మూడేళ్ల శిక్షణ కాలంలో జిల్లాస్థాయిలో పది స్వర్ణ పతకాలు, రాష్ట్రస్థాయిలో ఏడు బంగారు పతకాలు, జాతీయ స్థాయిలో ఒక సిల్వర్, మూడు బ్రాంజ్ పతకాలను కైవసం చేసుకుని, అందరి దృష్టినీ ఆకట్టుకున్నాడు. ఆర్చరీ గుర్తింపు సంపాదించాడు.

ప్రపంచస్థాయి గుర్తింపే లక్ష్యం

వచ్చే ఏడాది నుంచి వరుసగా విలువిద్య వరల్డ్‌కప్, వరల్డ్ చాంపియన్‌షిప్, కామన్వెల్త్, ఏషియా గేమ్స్ జరగనున్నాయి. వీటిలో తప్పకుండా ప్రాతినిధ్యం వహించి రాణిస్తాను. దేశానికి మంచిపేరు తీసుకురావడమే నా ముందున్న ప్రధాన లక్ష్యం.

- తరుమూరు గణేష్ మణిరత్నం



కుటుంబ సభ్యులతో..

విదేశాల్లోనూ సత్తా

- 2023లో ఐర్లాండులో జరిగిన యూత్ వరల్డ్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో అండర్-18కాంపౌండ్ విభాగంలో సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నాడు. ఇండియా నుంచి ఎంపికైన యువకుల్లో తొలిస్థానం సంపాదించాడు.
- ఈ ఏడాది జూన్‌లో సౌత్‌కొరియాలోని సువాన్‌లో జరిగిన ఏషియాకప్ స్టేజ్-3(వరల్డ్ ర్యాంకింగ్ టోర్నమెంట్)లో వ్యక్తిగతంగా ఐదవ ర్యాంకు, జట్టుతో బ్రాంజ్ మెడల్ సాధించాడు.
- ఈ ఏడాది సెప్టెంబరులో చైనీస్‌తైపైలో జరిగిన ఏషియన్ ఆర్చరీ యూత్ చాంపియన్‌షిప్‌లో వ్యక్తిగతంగాను, గ్రూపులోనూ బంగారు పతకాలు సాధించాడు.

ప్రభుత్వమే 108 సర్వీసు నడపాలి

ఉద్యోగులకు పనికి తగిన వేతనం ఇవ్వాలి



సమ్మె నోటీసు చూపుతున్న 108 ఉద్యోగులతో కిరణ్‌కుమార్

తిరుపతి(లీలామహల్), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): 108 సర్వీసును ప్రభుత్వమే నిర్వహిస్తూ ఈఎంటీ, పైలెట్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కె.కిరణ్‌కుమార్ కోరారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ 108 సర్వీసు కార్పొరేటర్లకు వరంగా మారుతోందన్నారు. గతంలో కాంట్రాక్టర్లకు రూ.300 కోట్లకు పైగా చెల్లించారని తెలిపారు. కాంట్రాక్టర్ మారిన ప్రతిసారీ ఉద్యోగుల జీతభత్యాలు, ఇంక్రిమెంట్లు తదితర సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఏ శాఖలోనూ లేనివిధంగా 108 సర్వీసులో రోజుకు రెండు షిఫ్టులుగా 12 గంటల చొప్పున పనులు చేయించుకుని, పనికి తగిన వేతనం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు షిఫ్టుల విధానంతో 8 గంటల చొప్పున పని విధానాలను మార్చాలని, జీతాలు సకాలంలో చెల్లించాలని కోరారు. ఇంక్రిమెంట్లు లేవు, బోనస్‌లు లేకపోయినా విధులు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో దుస్థితికి చేరిన 108 వాహనాలకు మరమ్మతులు చేయాలన్నారు. సిబ్బంది కొరత తీర్చాలని కోరారు. ప్రతి మండల కేంద్రంలోనూ 108 అంబులెన్స్ సిబ్బందికి శాశ్వత భవనం ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే 25వ తేదీ నుంచి సమ్మెకు వెళతామని స్పష్టం చేశారు. సమావేశంలో మహేష్, సునీల్, మునిరాజ, కేశవులు, సుధాకర్, శ్రీదేవి, ఊహ తదితరులు పాల్గొన్నారు.


4 నుంచి ఎస్వీయూలో డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ 3, 5వ సెమిస్టర్ పరీక్షలు డిసెంబర్ 4వ తేదీ నుంచి నిర్వహించనున్నారు. ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా పరీక్షలు నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ గురువారం విడుదలైంది. 4 నుంచి 28వ తేదీ వరకు పరీక్షలు కొనసాగుతాయి. పరీక్షల సమాచారాన్ని ఆయా కాలేజీలకు పంపినట్లు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

జర్మనీ భాషపై శిక్షణ, ఉద్యోగావకాశాలు

తిరుపతి(కలెక్టరేట్) నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎస్ఎం కేర్ సొల్యూషన్ సహకారంతో జర్మనీ భాషపై, నర్సింగ్ ఉద్యోగాల కల్పనపై శిక్షణ ఇవ్వనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం జేసీ శుభం బన్సల్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం ఆవిష్కరించారు. జీఎన్ఎం బీఎస్సీ నర్సింగ్ కలిగి ఉండాలని, స్విమ్స్ నర్సింగ్ కళాశాలలో ఆరు నెలల శిక్షణ ఇవ్వడం జరుగుతుందని లోకనాథం తెలిపారు. మరిన్ని వివరాలకు 99888 53335ను సంప్రదించాలని తెలిపారు.

సహకార వారోత్సవాలు ప్రారంభం



మాట్లాడుతున్న లక్ష్మి

తిరుపతి (కలెక్టరేట్), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నగరంలో 71వ అఖిల భారత సహకార వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ప్రాంతీయ సహకార కేంద్ర బ్యాంకు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ అధికారిణి లక్ష్మి మాట్లాడుతూ సహకార రంగ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. 20వ తేదీ వరకు ఈ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ వెంకటరమణ, అధికారులు ఉమాపతి, నాగభూషణం, రవీంద్రనాథ్, పెంచలయ్య, బ్యాంకు మేనేజరు శ్రీదేవి, సురేష్, సహకార సిబ్బంది పాల్గొన్నారు.





పుష్కరిణి వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్‌దీపాలంకరణ - దేవతామూర్తుల విద్యుత్ దీపాలంకరణ

తిరుచానూరు బ్రహ్మోత్సవాలకు శరవేగంగా ఏర్పాట్లు

తిరుచానూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు ఈనెల 28వ తేదీ ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నాయి. తొమ్మిది రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాలకు సంబంధించి టీటీడీ అధికారులు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యుత్ దేవతామూర్తుల కటౌట్లు, తిరుపతి నుంచి తిరుచానూరు వరకు విద్యుత్ దీపాలంకరణలు చేపట్టారు. ఆలయ పరిసరాలతో పాటు గ్రామం మొత్తం విద్యుత్ దీపాలంకరణలు చేస్తున్నారు. భక్తులు వేచి ఉండేందుకు నవజీవన్ ఆస్పత్రి సమీప ప్రాంతాలతో పాటు ప్రైవేటు, తోలప్పగార్డెన్ బస్టాండ్ల వద్ద ఇనుప షెడ్లు సిద్ధం చేస్తున్నారు. డిసెంబరు 6న బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన పంచమి తీర్థం జరగనుంది. ఈ ఉత్సవానికి దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో పుష్కరిణిలో పాత నీటిని తొలగించి కొత్తవి నింపనున్నారు. తొక్కిసలాట లేకుండా బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉత్సవాల ఏర్పాట్లపై విమర్శలు వచ్చిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేస్తోంది.

నకిలీ డాక్యుమెంట్లతో ప్రొఫెసర్‌కు టోకరా

- నలుగురిపై చీటింగ్ కేసు

రేణిగుంట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసిన నలుగురిపై గాజులమండ్యం పోలీసులు గురువారం చీటింగ్ కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు ఎస్వీ యూనివర్శిటీ ప్రొఫెసర్ సహదేవ్ తిరుపతి ఎమ్మార్‌పల్లిలో ఉంటున్నారు. రామచంద్రనగర్‌కు చెందిన సురేంద్ర, వెంకటసిద్దయ్య, వెంకటచెంచయ్య, భార్య రాజేశ్వరి కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటారు. వీరందరూ 2015లో రేణిగుంట మండలం తూకివాకం పంచాయతీ పరిధిలోని ఎర్రంరెడ్డిపాళెం లెక్క దాఖల సర్వే నెంబరు 526/6ఏలో 170 అంకణాల విస్తీర్ణమున్న 4 ప్లాట్లను రూ.52 లక్షలకు విక్రయించి రిజిస్ట్రేషన్ చేశారు. ఈ స్థలాన్ని గతేడాది కొనుగోలు చేసిన ప్రొఫెసర్ సహదేవ్ కాంపౌండ్ వాల్ నిర్మించేందుకు స్థలం వద్దకు వచ్చి పరిశీలిస్తుండగా చంద్ర అనే వ్యక్తి ప్రశ్నించాడు. ఈ స్థలం రిజిస్ట్రేషన్ చేసుకున్నామని ప్రొఫెసర్ చెప్పడంతో స్థల యజమాని అవాక్కయ్యాడు. ఎవరో మోసం చేశారని ..విచారించుకోవాలని సూచించడంతో సహదేవ్ కంగుతిన్నారు. రేణిగుంట తహసీల్దారు కార్యాలయంలో సంప్రదించారు. వారు సర్వే నిర్వహించి చంద్ర అనే పేరుపై రిజిస్టర్ అయిందని తెలపడంతో ప్రొఫెసర్ నిర్ఘాంతపోయారు. మోసపోయానని గుర్తించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023లో పోలీస్‌స్టేషన్ల చుట్టూ న్యాయం చేయాలని కోరినా పట్టించుకోలేదు. ఎస్పీ సుబ్బరాయుడుకు తాజాగా ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసిన నలుగురిపై గురువారం గాజులమండ్యం పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదు అయింది.

షార్‌లో ఘనంగా ప్రపంచ నాణ్యత దినోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న షార్ డైరెక్టర్ రాజరాజన్, పక్కనే హెచ్ఎస్ఎఫ్‌సీ డీడీ గీతాకృష్ణన్

సూళ్లూరుపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో ప్రపంచ నాణ్యత దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. శ్రీహరికోటలోని బ్రహ్మప్రకాష్ హాలులో షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అధ్యక్షతన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన బెంగళూరులోని హెచ్ఎస్ఎఫ్‌సీ డిప్యూటీ డైరెక్టర్ గీతాకృష్ణన్ మాట్లాడుతూ అన్ని విషయాల్లో నాణ్యత ప్రమాణాల ప్రాముఖ్యత గురించి తెలియజేసేందుకు ప్రతి ఏడాది షార్‌లో ఈ కార్యక్రమం నిర్వహించడం మంచిదన్నారు. భారత గగన్‌యాన్ కార్యక్రమంలో నాణ్యత ప్రమాణాల ప్రాముఖ్యత గురించి క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో షార్ కంట్రోలర్ శ్రీనివాసులరెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ హమీద్, గ్రూపు డైరెక్టర్ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సూళ్లూరుపేట పట్టణం సూళ్లూరు వద్ద వంతెనపై ప్రవహిస్తున్న నెర్రి కాలువ నీరు

సూళ్లూరుపేటలో భారీ వర్షం

సూళ్లూరుపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో గురువారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురిసింది. పట్టణంలో వీధులన్నీ జలమయమయ్యాయి. కాలువల్లో చెత్త పేరుకుపోవడంతో వర్షపు నీటికి మురుగునీరు తోడై రోడ్లపై పారడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మున్సిపల్ కార్యాలయం ముందు మురుగునీరు నిలబడింది. చెంగాలమ్మ ఆలయ సమీపంలోని సూళ్లూరు వద్ద నెర్రికాలువ నీరు వంతెనపై పొంగి ప్రవహిస్తోంది. మండలంలోని మంగళంపాడు, మంగానెల్లూరు దళితవాడల్లో వర్షపునీరు రోడ్లపై నిలబడడంతో ప్రజలకు అవస్థలు తప్పలేదు. మంగానెల్లూరు దళితవాడలో అంగన్‌వాడీ కేంద్రం నుంచి వెంకటేశ్వరస్వామి ఆలయం వరకు వర్షపు నీరు నిలబడి మడుగును తలపిస్తోంది. ఇక్కడ సీసీ రోడ్డు ఉన్నా వర్షపు నీరు పోయే దారిలేక ఆలయంలోకి చేరుతోంది.

వెంకటగిరిలో మోస్తరు వర్షం

వెంకటగిరిటౌన్ : వెంకటగిరిలో గురువారం ఉదయం భారీ వర్షం కురిసింది. మూడు రోజులుగా వర్షం పడడంతో చెరువులు, కుంటలు, కాలువల్లోకి నీరు చేరాయి.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

డిప్యూటీ స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్యే విజయశ్రీ



సూళ్లూరుపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నికైన కనుమూరి రఘురామకృష్ణ రాజును గురువారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అసెంబ్లీలో మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ధనలక్ష్మి

నాయుడుపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుధ్యంపై అధికారులు దృష్టి సారించాలని ఎంపీపీ ధనలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి పైపులైన్‌లను ఎప్పటికప్పుడు మరమ్మత్తులు చేయించాలని తెలిపారు. గ్రామాల్లో నూతనంగా పనులు ప్రారంభించేటప్పుడు అధికారులు గ్రామ సర్పంచ్‌కు సమాచారం అందించాలని కోరారు. అనంతరం శాఖల వారీగా సంబంధిత అధికారులు నిర్వహించిన పనులు, చేయాల్సిన పనుల వివరాలను వెల్లడించారు. తహసీల్దారు రాజేంద్ర, ఎంపీడీవో సురేష్‌బాబు, ఐసీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరి, అన్నిశాఖల అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీల వితరణ



సూళ్లూరుపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరు ఎన్‌టీఆర్ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి తిరుపతికి చెందిన క్రెడిట్ యాక్సస్ గ్రామీణ ఇండియా ఫౌండేషన్ నిర్వాహకులు బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని సీడీపీవో శారదాంబ ఆధ్వర్యంలో కుర్చీలు, బల్లలు, ఇతర సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు జగదీష్, సిద్దారెడ్డి, ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మనష సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు విద్యలో రాణించాలి



బాలికకు సైకిల్ అందజేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

గూడూరు అర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బాలికలు విద్యలో రాణించాలని శ్రీకృష్ణసేవాసమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ అన్నారు. గురువారం స్థానిక గాంధీనగర్‌లోని మినీగురుకులంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణసేవాసమితి దాతృత్వంతో పలు కార్యక్రమాలను నిర్వహించారు. బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థినులకు ఆటల పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఓ విద్యార్థినికి సైకిల్‌ను పంపిణీ చేశారు. వెంకటేశ్వర్లురెడ్డిరెడ్డి, దశరథరామిరెడ్డి, కిరణ్‌చక్రవర్తి, జీజీనాయుడు, రాంప్రసాద్ పాల్గొన్నారు.

భూ రీసర్వే చేయకుండానే
సర్వేరాళ్లపై పేరుకోసం నిధుల ఖర్చు: టీడీపీ



సర్వేరాళ్లపై జగనన్న భూరక్ష పేరును తొలగిస్తున్న సర్వేయర్లు, టీడీపీ నాయకులు

చిల్లకూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ఆర్భాటంగా చేపట్టిన జగనన్న భూరీసర్వే కార్యక్రమాన్ని కొన్ని గ్రామాల్లో చేయకుండానే సర్వే రాళ్లపై పేరును ముద్రించేందుకు లక్షలాది రూపాయలు ఖర్చు చేశారని టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పచ్చ వెంకటేశ్వర్లు నాయుడు ఆరోపించారు. గురువారం స్థానిక కడివేడు సొసైటీ గోదాము వద్ద నిల్వ ఉన్న సర్వేరాళ్లపై ఉన్న జగనన్న భూరక్ష పేరును తొలగించారు. ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం కొన్ని గ్రామాల్లో రీసర్వే చేయకపోవడంతో రాళ్లు, పేరు కోసం ఖర్చు చేసిన నిధులు వృథా అయ్యాయన్నారు. ఇందుకోసం కడివేడు పంచాయతీలో సుమారు రూ.8లక్షలు ఖర్చు చేశారన్నారు. మజిద్, సర్వేయర్లు శశి, సాయితరుణ్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలి

డక్కిలి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రతి రోజూ రుచికరమైన భోజనాన్ని అందించాలని ఎంఈవో జగదీష్ బాబు అన్నారు. గురువారం ఆయన మండలంలోని లింగసముద్రం, సూరాయపాళెం ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీచేశారు. ఆయన విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. అనంతరం మధ్యాహ్నం భోజనం పథకాన్ని పరిశీలించారు.

డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలు

సూళ్లూరుపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌ఎల్‌బి శంకర్ శర్మ విద్యార్థులకు లైబ్రరీ ప్రాముఖ్యత గురించి వివరించారు.

మహిళలకు క్యాన్సర్ పరీక్షలు

కోట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకన్నపాళెంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన క్యాన్సర్‌పై విజయం-స్క్రీనింగ్‌తో సాధ్యం అనే కార్యక్రమాన్ని గురువారం స్థానిక సర్పంచ్ కోకర్ల మధు యాదవ్ ప్రారంభించారు. ఎంపీడీ-పీడీ-3.0 సర్వేని ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకన్నపాళెం, వీరారెడ్డిసత్రం గ్రామాల్లో ఏఎన్‌ఎం నిరోషా ఆధ్వర్యంలో ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది ఇంటింటా తిరిగి అసంక్రమిత వ్యాధులపై మహిళలకు అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటా తిరిగి మహిళలకు క్యాన్సర్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వసంత, అమరావతి, చెంచుకృష్ణమ్మ పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం



బోల్తాపడ్డ కంటైనర్‌ను పక్కకు తీస్తున్న దృశ్యం

సూళ్లూరుపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని మన్నారుపోలూరు క్రాస్ సమీపంలోని ఎంఆర్ గార్డెన్ హోటల్ వద్ద గురువారం కంటైనర్ అదుపు తప్పి బోల్తాపడింది. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. పోలీసుల వివరాల మేరకు మోటరు సైకిల్ అదుపు తప్పి పడిపోయిన సమయంలో నెల్లూరు వైపు నుంచి చెన్నైకు వెళ్తున్న కంటైనర్ మోటారు సైకిల్‌ను తప్పించబోయి అదుపు తప్పి బోల్తాపడింది. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. వెంటనే పోలీసులు, హైవే సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని క్రేన్, జేసీబీల సాయంతో కంటైనర్‌ను తొలగించారు.

ప్రతిభ కలిగిన విద్యార్థులకు అండగా ఉంటాం



విద్యార్థినికి రూ.10వేల చెక్కును అందజేస్తున్న అల్లం రమణయ్య

కోట, నవంబరు 14(ఆంధ్ర జ్యోతి): ప్రతిభా పాటవాలు కలిగి ఆర్థిక స్థోమత లేని విద్యార్థులను దాతల సహకారంతో అన్ని విధాలుగా ఆదుకుంటామని శ్రీషిరిడీ సాయి అక్షయ సేవాసమితి కన్వీనర్ అల్లం రమణయ్య హామీ ఇచ్చారు. కోటలోని అక్షయ సేవాసమితి కార్యాలయంలో గురువారం శ్యామసుందరపురం గ్రామానికి చెందిన కరుణ అనే నిరుపేద విద్యార్థినికి అజ్ఞాత దాత రూ.10వేలు చెక్కురూపంలో ఇవ్వగా... అల్లం రమణయ్య చేతుల మీదుగా అందజేశారు. శ్యామసుందరపురంకు చెందిన కురుగొండ కవిత తన కుమార్తె కరుణను నెల్లూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదివిస్తుండగా ఫీజులు కట్టలేని పరిస్థితిని అక్షయ సేవాసమితి దృష్టికి తీసుకురావడంతో స్పందించిన రమణయ్య అజ్ఞాతదాత ద్వారా విద్యార్థినికి అండగా నిలిచారు.

భర్త తాగుడు భరించలేక భార్య ఆత్మహత్య



మృతి చెందిన కుమార్‌సుధా

తడ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): భర్త మరోసారి మద్యం సేవించాడని మనస్తాపం చెంది ఓ మహిళ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మండల పరిధిలోని రామాపురం పంచాయతీ ఎస్‌ఆర్‌కండ్రిగ గ్రామానికి చెందిన కుమార్‌సుధా (48) గుమ్మిడిపూడిలోని ఓ పరిశ్రమలో పనిచేస్తోంది. ఆమె భర్త కుమార్ లారీడ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. గతంలో మద్యానికి బానిసగా ఉన్న భర్తకు కుటుంబ బాధ్యతలు చెప్పి మద్యం సేవించకుండా ప్రమాణం చేయించుకుంది. అప్పటి నుంచి ఆయన మద్యం మానేశాడు. అయితే బుధవారం రాత్రి ఇంటి నుంచి రూ.500 తీసుకొని బయటకువెళ్లి మద్యం సేవించి వచ్చాడు. దీంతో మనస్తాపం చెందిన భార్య కుమార్‌సుధా ఇంటి పక్కన ఉన్న మేకల దొడ్డిలోకి వెళ్లి చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే కుటుంబసభ్యులు ఆమెను చెన్నైకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోతులమయంగా ఆర్‌అండ్‌బీ రోడ్లు



వాకాడు మండలం కొత్తూరు వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డుపై వర్షపునీరు - గూడలి వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న గోతులు - దొరవారిసత్రం మండలం కల్లూరుకండ్రిగ వద్ద నీటి మడుగులా ఉన్న ఆర్‌అండ్‌బీ రహదారి

కోట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కోట మండలంలోని పలు ఆర్‌అండ్‌బీ రోడ్లు గోతులమయం కావడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. కోట నుంచి సిద్ధవరం, ఉత్తమనెల్లూరు, కర్లపూడి గ్రామాల్లో ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. గూడలి నుంచి బంగాళాఖాతం వరకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా తయారైంది. గూడలి స్వర్ణముఖినది నుంచి నాయుడుపేట వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో వాహనచోదకులు, పాదచారులు, తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వర్షపు నీరు నిలచిపోవడంతో గుంతలు తెలియక పలువురు వాహన చోదకులు ప్రమాదాలబారిన పడుతున్నారు.

చెరువును తలపిస్తున్న రోడ్డు

వాకాడు: మండలవ్యాప్తంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ ఛిద్రమయ్యాయి. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వర్షపునీటితో నిండుకొని చెరువును తలపిస్తున్నాయి. దుగరాజపట్నం పంచాయతీలోని కొత్తూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలు పడటంతో అస్తవ్యస్తంగా మారింది. వర్షానికి నీరంతాచేరి ప్రయాణం చేయాలంటే నరకంగా ఉందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోకాళ్లలోతు నీరు నిల్వ ఉంటుందని వాపోతున్నారు. వాకాడు నుంచి దుగరాజపట్నం మీదుగా మల్లాంకు వాహనాల రాకపోకలు సాగుతుండటంతో ప్రయాణికులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నీటి మడుగులా రహదారి

దొరవారిసత్రం: మండలంలోని కల్లూరుకండ్రిగ వద్ద సూళ్లూరుపేట-వాకాడు ఆర్‌అండ్‌బీ రహదారి నీటి మడుగులా తయారైంది. వర్షాలకు పంట పొలాల్లో పడిన నీరు అంతా రహదారి పైకి చేరి మడుగులా మారింది. వర్షపు నీరు తూర్పు వైపున గల పొలాల వైపు ప్రవహించాల్సి ఉంది. మలుపు ఉన్న రహదారిలో లోతట్టుగా ఉండటంతో అక్కడ చేరిన నీరు బయటకు పోక ఆగిపోవడంతో మడుగులా ఏర్పడింది. కార్లు, ద్విచక్ర వాహన దారులకు ఇబ్బందికరంగా మారింది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాల్సి ఉంది.

ఘనంగా బాలల దినోత్సవం



గూడూరు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు అందజేసిన పూర్వ విద్యార్థుల సంఘ నాయకులు

గూడూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవ కార్యక్రమాలను గురువారం పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు, క్రీడాపోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. సీనియర్ ఆడిటర్ శ్రీకంటి రామమోహన్‌రావు మాట్లాడుతూ చదువులతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సనత్‌కుమార్, దేవానంద్, హెచ్‌ఎం భారతి, పీడీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. చెన్నూరు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో తిరుపతి పార్లమెంటు తెలుగుమహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీడీపీవో మెహబూబి తదితరులు పాల్గొన్నారు. నెల్లటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన హెచ్‌ఎం పార్వతమ్మ, సిద్దారెడ్డి, రాఘవేంద్ర, బాబు తదితరులు పాల్గొన్నారు. స్థానిక బాలసదనంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించి విద్యార్థినులకు బిస్కెట్‌ప్యాకెట్లు అందజేశారు. అరవ పార్వతయ్య, మెహబూబ్‌బాషా, నయోమి, అరుణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా చిల్లకూరు మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు ఆట పోటీలు, వ్యాసరచన పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు.

నాయుడుపేట: నాయుడుపేట ఎల్‌పి సాగరంలోని బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రిన్సిపాల్ దాదాపీర్ ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు నివాళులు అర్పించారు. అధ్యాపకులు వెంకటరమణ, శేఖర్ బాబు, వెంకటేష్, బాలాజీ తదితరులు విద్యార్థులు పాల్గొన్నారు.

కోట: కోటలోని మహాత్మాజ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకులంలో ఆ గురుకులాల జిల్లా కన్వీనర్ నారాయణరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రాథమిక, ఉన్నత, గురుకుల పాఠశాలల్లో ఎంఈవో మస్తానయ్య ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈ సంబరాలు జరుపుకున్నారు.

సూళ్లూరుపేట: మండల పరిధిలోని అట్టకానితిప్ప ప్రాథమిక పాఠశాలలో ఆచార్య భరద్వాజ సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఆచార్య భరద్వాజ సేవా సంస్థ సభ్యులు లలితమ్మ, పాఠశాల హెచ్‌ఎం శ్రీహరికోట రేవతి, పాఠశాల కమిటీ చైర్మన్ కుయిల్ పాల్గొన్నారు.

తడ: రామాపురం ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో కె.మల్లికార్జున్‌రావు పాల్గొని కలాం వరల్డ్ రికార్డు సాధించిన 2వ తరగతి విద్యార్థి జయమిత్రను అభినందించి శాలువాతో సత్కరించారు. 100 మంది శాస్త్రవేత్తల పేర్లు, వారు కనిపెట్టినవాటిని చెప్పడం ద్వారా కలాం వరల్డ్ రికార్డును సదరు విద్యార్థి సాధించాడని అభినందించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం మాధవి బహుమతులను అందజేశారు.



ఎల్‌పి సాగరం బాలుర గురుకులంలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ దాదాపీర్, రాజశేఖర్, కృష్ణయ్య - అట్టకానితిప్పలో విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేస్తున్న ఆచార్య భరద్వాజ సేవాసంస్థ సభ్యులు, ఉపాధ్యాయులు - రామాపురంలో కలాం వరల్డ్ రికార్డును సాధించిన విద్యార్థి జయమిత్రను అభినందిస్తున్న ఎంఈవో మల్లికార్జున్‌రావు

ప్రజాసమస్యలు పరిష్కరించాలి: సీపీఎం



గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

గూడూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ నిత్యావసరాల ధరలు పెరిగిపోవడంతో పేద, మధ్యతరగతి ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. ధరల నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో అంబేడ్కర్ నూతన భవనాన్ని నిర్మించాలన్నారు. నాయకులు జోగి శివకుమార్, వెంకట్రామిరెడ్డి, బీవీ రమణయ్య, సురేష్, ప్రసాద్, ముత్యాలయ్య, మణి, చంద్రమోహన్, చంద్రయ్య, వెంకటయ్య, శంకరయ్య పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఇచ్చిన హామీలన్నింటిని వెంటనే నెరవేర్చి ప్రజా సమస్యలను పరిష్కరించాలంటూ డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీలు తగ్గించి, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. అనంతరం ఆర్డీవో కిరణ్మయికి వినతిపత్రం అందజేశారు. సీపీఎం నాయకులు పద్మనాభయ్య, లక్ష్మయ్య, రియాజ్, అల్లెయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: తహసీల్దారు కార్యాలయం ఎదుట సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు ధర్నా చేపట్టారు. సీపీఎం నేత మహేష్‌బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నిత్యావసర వస్తువులు, వంటనూనె ధరలు పెరుగుతున్నాయని చెప్పారు. అనంతరం తహసీల్దారు రాజేంద్రకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం నాయకులు శివకవి ముకుంద, ప్రజా సంఘం నాయకులు పుట్టయ్య, రమణయ్య తదితరులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

గూడూరు అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రైతులు అధిక మోతాదులో రసాయనిక ఎరువులను, పురుగు మందులను వినియోగించకుండా ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారిస్తే పెట్టుబడులు తగ్గి అధికలాభాలు పొందవచ్చునని వ్యవసాయశాఖ ఏడీ గోపీనాయక్ సూచించారు. మండలంలోని పాలిచెర్ల, పాలిచెర్లరాజుపాళెం గ్రామాల్లో గురువారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో రమేష్, చెంచురెడ్డి, శివ, రైతులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు 4డీ స్క్రీనింగ్ పరీక్షలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ డానియేల్‌రాజ్, వైద్యసిబ్బంది

ఓజిలి, నవంబరు 14: మండలంలోని రాజుపాళెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు క్షయ, న్యుమోనియా, ఇతర వ్యాధులపై ఓజిలి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ డానియేల్‌రాజ్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు 4డీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడంతోపాటు తలిదండ్రులకు కూడా అవగాహన కల్పించేందుకు వైద్య సిబ్బంది ద్వారా ఇంటింటా విస్తృత ప్రచారం చేపడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేపట్టేందుకు సిబ్బందిని సమాయత్తం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి అనూషా

వెంకటగిరిటౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు భారతీయ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని వెంకటగిరి కోర్టు సివిల్ జడ్జి అనూషా సూచించారు. గురువారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడతూ విద్యార్థి వయస్సు నుంచి క్రమశిక్షణతో మెలగాలన్నారు. అనంతరం బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తులసీ జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్‌ను కలసిన కామిరెడ్డి



జగన్‌ను కలసిన వైసీపీ నాయకులు

పెళ్లకూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్‌ను ఎన్డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి గురువారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని జగన్ ఆదేశించినట్లు ఆయన తెలిపారు. అనంతరం వైసీపీ నాయకులు ఎల్లు మోహన్, గంజి దయాకృష్ణ, గోగుతొట్టి ఆనంద్ తదితరులను జగన్‌కు పరిచయం చేశారు.

ఎయిడ్స్‌పై అవగాహన

వెంకటగిరిటౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్‌లో నవజీవన్ ఆర్గనైజేషన్-సీసీటీవి ప్రాజెక్టు ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు మేనేజర్ బాలాజీ మాట్లాడుతూ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ విభాగం సహకారంతో నవజీవన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 'మీకు తెలుసా కార్యక్రమం' ద్వారా ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. టోల్ ఫ్రీ నెంబరు 1097 ద్వారా తెలిపితే పూర్తి సమాచారం అందిస్తామన్నారు. అనంతరం మండల పరిధిలోని మరాటపల్లిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నవజీవన్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న నవజీవన్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు

ప్రతి టీడీపీ కార్యకర్తా సభ్యత్వం తీసుకోవాలి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న రమేష్, వెంకటేశ్వర్లు రెడ్డి తదితరులు

సూళ్లూరుపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో ఉన్న ప్రతి కార్యకర్తా పార్టీ సభ్యత్వం తప్పనిసరిగా తీసుకోవాలని ఆ పార్టీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్ అన్నారు. గురువారం పట్టణంలోని సాయినగర్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ కార్యకర్తలు సభ్యత్వం తీసుకోవడం వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తింపచేసే విధంగా అధినేత చంద్రబాబు నిర్ణయం తీసుకొన్నారని చెప్పారు. కార్యక్రమంలో చెంగాళమ్మ ఆలయ ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ ముప్పాళ్ల వెంకటేశ్వర్లు రెడ్డి, మేడా సాయి నారాయణ, బూత్ కన్వీనర్ రాజశేఖర్, కొండలరావు, హరీష్, నాని తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: టీడీపీ సభ్యత్వం తీసుకున్న వారందరికీ ప్రమాద బీమా సౌకర్యం వర్తిస్తుందని పార్టీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య అన్నారు. మండలంలోని కానూరు, పునబాక గ్రామాలలో గురువారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు వెంపళ్ల వెంకటేశ్వర్లు, నేలవల్లి సిద్ధులయ్య నాయుడు, మురళీ నాయుడు, నెలవల ప్రసాద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడ్డ ఆవు

సూళ్లూరుపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని రాఘవయ్యపేట ప్రాథమిక పాఠశాల సమీపంలోని ఇళ్ల వద్దనున్న పాడుపడ్డ బావిలో ప్రమాదశాత్తు ఓ ఆవు పడిన సంఘటన గురువారం చోటుచేసుకొంది. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వెంటనే వారు సంఘటనా స్థలానికి చేరుకొని స్థానికుల సాయంతో బావిలో పడ్డ ఆవును సురక్షితంగా బయటకు తీశారు. అనంతరం ఆవును పశువైద్యశాలకు తరలించి చికిత్స చేశారు.

కిషోరబాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

వాకాడు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కిషోర బాలికలు ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ సీడీపీవో మునికుమారి సూచించారు. మండలంలోని వాకాడు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం బాలల దినోత్సవం సందర్భంగా కిషోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.